PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...
శుభోదయ
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 116, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 16 - జూన్ - 2026 , వెల రూ.5/-



## దేశ ఆర్థిక వ్యవస్థ బాగానే ఉంది.. కానీ.. మంత్రి నిర్మలా సీతారామన్

- భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందని తెలిపిన నిర్మలా సీతారామన్
- వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని, నిరంతర సంస్కరణలు అవసరమని స్పష్టీకరణ
- ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిక
- కొన్ని రంగాలకు విధానపరమైన మద్దతు ఇంకా అవసరమని వెల్లడి

### అమరావతిలో సింగపూర్ వర్సిటీ...
# విద్యారంగంలో ముందడుగు
## ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా సీఎం చంద్రబాబు..

- ★ గూగుల్, ఎన్‌యూఎస్‌తో కీలక భేటీలు
- ★ గూగుల్ క్లౌడ్, సింగపూర్ వర్సిటీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ
- ★ ఏపీని ఏఐ, డేటా హబ్‌గా మార్చేందుకు గూగుల్ తో కీలక చర్చలు
- ★ నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ★ అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఎన్‌యూఎస్‌కు ప్రతిపాదన
- ★ రాష్ట్ర అభివృద్ధికి సాంకేతిక, విద్యా రంగాల్లో భాగస్వామ్యంపై దృష్టి



అమరావతి: సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు వివిధ సంస్థలతో వరుస భేటీలు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. ఏపీని టెక్నాలజీ, విద్యారంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గూగుల్ క్లౌడ్, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా మిగతా 2 లో

### మోదీ పర్యటనకు 'ధురంధర్' టచ్..
## మేక్రాన్ ఆసక్తికర పోస్ట్



- ఫ్రాన్స్‌లో పర్యటించిన మోదీ
- అధ్యక్షుడు మేక్రాన్‌తో భేటీ
- పర్యటన వివరాలను వీడియో రూపంలో పోస్ట్ చేసిన మేక్రాన్
- బ్యాగ్రౌండ్‌లో ధురంధర్ పాట

ఢిల్లీ: భారత్-ఫ్రాన్స్ సంబంధాలకు బాలీవుడ్ టచ్ ఇచ్చారు ఫ్రాన్స్ అధ్యక్షుడు



### విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలని
## పార్టీ శ్రేణులకు పిలుపు

- 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు.. సుమతీ శతకంతో పోలిక!
- ఢిల్లీలో జనసేన పార్టీ సమావేశం
- కాక్రోచ్ జనతా పార్టీపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సుమతీ శతకాన్ని ఉటంకిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు
- చీమల చేతిలో బలమైన పాము కూడా చనిపోతుందని వ్యాఖ్య

# హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది
## మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

సీఎం రేవంత్ రెడ్డి

- కిషన్‌రెడ్డి, అశ్విని వైష్ణవ్‌పై రేవంత్ విమర్శలు
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు:ఐఆర్ఎఫ్‌సీ రుణం నిలిపేశారన్న వాదన
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు:ఎన్ఓసీ ఇస్తే చాలన్న సీఎం
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు:బీజేపీ, బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్ : హైదరాబాద్ విస్తరణను అడ్డుకుంటుందని కేందమంత్రి జి.కిషన్ రెడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో టేకోవర్ కావాల్సిన మిగతా 2 లో



### హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక: డిప్యూటీ సీఎం భట్టి

- హైదరాబాద్ సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిదర్శనమన్న భట్టి విక్రమార్క
- మ్యూజియం 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, డిప్యూటీ సీఎం
- మ్యూజియం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్న భట్టి విక్రమార్క
- ఈ నెల 21 వరకు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణ



### దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు..
## కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు

- కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మోదీ శుభాకాంక్షలు
- కష్టపడే నాయకుడని ప్రశంసలు
- బొగ్గు, గనుల రంగంలో సంస్కరణలు చేపట్టారని కితాబు
- అమిత్ షా సహా ఇతర కేంద్ర మంత్రులూ శుభాకాంక్షలు

ఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

### ఇరాన్ నిధులపై ట్రంప్ మెలిక..
## రూ.లక్ష కోట్ల నిధులపై వీడని ప్రతిష్టంభన

అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం ఖరారు



- మూడు నెలల సైనిక ఉద్రిక్తతలకు ముగింపు
- జూన్ 19న స్విట్జర్లాండ్‌లో అధికారికంగా సంతకాలు
- హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- నిలిచిపోయిన నిధుల విడుదలే ఒప్పంద అమలుకు కీలకం

### రాష్ట్రంలో యూఎన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
# ఏర్పాటుకు ప్రతిపాదన
## తీరప్రాంత నగరాల రక్షణ, మురికివాడల అభివృద్ధిపై చర్చ

- తీరప్రాంత నగరాల రక్షణకు 'రైజప్'.. యూఎన్ హాబిటాట్‌కు సీఎం చంద్రబాబు ప్రతిపాదన
- సింగపూర్‌లో యూఎన్ హాబిటాట్ డైరెక్టర్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- సీఎం ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన యూఎన్ ప్రతినిధులు




అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సింగపూర్ పర్యటనలో భాగంగా రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తో ఆయన సమావేశమై మిగతా 2 లో

### పశ్చిమాసియాలో శాంతికి మార్గం..
# అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ
## అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్లు ప్రకటన

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్లు ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష



ఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని మిగతా 2 లో

### అధికారులపై సీఎం రేవంత్ ఫైర్..
## అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!



వర్షాలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

- అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
- అవసరమైతే తానూ రోడ్లపైకి వస్తానని వెల్లడి
- నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

### యూపీలో 'ఇండియా' కూటమిలో
## ఎంఐఎం చిచ్చు.. భిన్నస్వరాలు

- 2027 యూపీ ఎన్నికల్లో ఎంఐఎంతో పొత్తుపై
- ఇండియా కూటమిలో భిన్నాభిప్రాయాలు
- ఒవైసీతో కలిసేందుకు సమాజ్‌వాదీ పార్టీ సుముఖం, కాంగ్రెస్ మాత్రం అభ్యంతరం
- బీజేపీని ఓడించే శక్తులతో కలుస్తామని ఎస్పీ నేత రామ్ గోపాల్ యాదవ్ వెల్లడి
- మతతత్వంతో రాజీ పడలేమని కాంగ్రెస్ నేత ఇమ్రాన్ మసూద్ స్పష్టీకరణ
- గౌరవం, సమాన హోదా ఇస్తేనే పొత్తుకు సిద్ధమని ప్రకటించిన అసదుద్దీన్ ఒవైసీ

ఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా విపక్షాలు వ్యూహరచన చేస్తున్న తరుణంలో, 'ఇండియా' కూటమిలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీతో పొత్తు పెట్టుకునే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), మిగతా 2 లో



### మోదీ పర్యటనకు 'ధురంధర్' టచ్..

# మేక్రాన్ ఆసక్తికర పోస్ట్

ఢిల్లీ: భారత్-ఫ్రాన్స్ సంబంధాలకు బాలీవుడ్ టచ్ ఇచ్చారు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఆయన షేర్ చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ చిత్రం 'ధురంధర్'లోని ప్రముఖ 'ఆరీ ఆరీ' పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో ప్లే చేస్తూ మోదీ పర్యటనలోని ముఖ్య ఘట్టాలను ఆ వీడియోలో పొందుపరిచారు. సుమారు 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోను 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్‌లో మేక్రాన్ పోస్టు చేశారు. మోదీ, మేక్రాన్ పరస్పరం కరచాలనం చేసుకోవడం, ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడం నుంచి వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో మోదీ పాల్గొన్న కార్యక్రమాలు, ఇరు దేశాల మధ్య సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన దృశ్యాలు కనిపిస్తాయి. భారతీయ పాప్ కల్చర్‌ను మేక్రాన్ తన సోషల్ మీడియా పోస్టుల్లో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా భారత్ పర్యటన ముగిసిన తర్వాత 'ధురంధర్'కు సంబంధించిన సంగీతంతో కూడిన వీడియోను ఆయన షేర్ చేశారు. దీంతో భారతీయ నెటిజన్ల నుంచి మంచి స్పందన లభించింది.

### దేశ ఆర్థిక వ్యవస్థ బాగానే ఉంది..

# కానీ.. మంత్రి నిర్మలా సీతారామన్

ఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందని, అయితే ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దీర్ఘకాలికంగా వృద్ధిని కొనసాగించాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం చాలా అవసరమని ఆమె స్పష్టం చేశారు. ఇవాళ జరిగిన 'మైండ్‌మైన్ సమ్మిట్ 2026'లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. "మన దేశం ఆర్థికంగా బాగానే రాణిస్తోందని నాకు తెలుసు. కానీ, మన పనితీరును మనం నిరంతరం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. ఇంకా ఎక్కడ మెరుగుపరుచుకోవాలో గుర్తించాలి" అని అన్నారు. కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే సరిపోదని, స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్ వంటి పెద్ద, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని నిలబెట్టుకోవాలంటే సామర్థ్యాలను బలోపేతం చేయడం, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చూడటం కోసం నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. "పురోగతి దానంతట అదే వస్తుందని భావించకూడదు. వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి నిరంతర కృషి, ఆవిష్కరణలు, సంస్కరణలు తప్పనిసరి" అని ఆమె పేర్కొన్నారు. అనేక రంగాలు బలంగా రాణిస్తున్నప్పటికీ, ముఖ్యంగా సంక్లిష్టమైన, మధ్యంతర ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన కొన్ని రంగాలకు విధానపరమైన మద్దతు ఇంకా అవసరమని ఆమె అంగీకరించారు. దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు లేదా కొత్త విధానాల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో విధానకర్తలు నిరంతరం పరిశీలించాలని అన్నారు.

ఎల్ నినోపై హెచ్చరిక

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంపై కేంద్ర మంత్రి కీలక హెచ్చరిక చేశారు. దీని కారణంగా రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. "కొన్ని ప్రాంతాలు పొడిగా ఉండొచ్చు, మరికొన్ని చోట్ల అధిక వర్షాలు కురవొచ్చు. ఇది ఏడాది పొడవునా ఆందోళన కలిగించే అంశం. అయితే, ఈసారి ఎల్ నినో కారణంగా బలహీనమైన రుతుపవనాలకు మేం సిద్ధమవుతున్నాం" అని నిర్మల వివరించారు. కోవిడ్-19 మహమ్మారి అనంతర ప్రభావాలు ఇంకా ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, పెద్ద అంతరాయాలు ఏవీ ఊహించడం లేదని ఆమె తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

### విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలని

# పార్టీ శ్రేణులకు పిలుపు

అమరావతి: దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఢిల్లీలో జనసేన పార్టీ నిర్వహించిన 'సేన ప్రస్థానం-జాతీయ సమైక్యత కోసం' సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న శక్తులను తక్కువ అంచనా వేయకూడదని, అవి బలమైన ప్రభావాన్ని చూపగలవని సుమతీ శతకాన్ని ఉటంకిస్తూ వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతి, నిరుద్యోగం, విద్యావ్యవస్థలోని లోపాలను నిరసిస్తూ యువత సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన ఉద్యమమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఈ పేరుతో పలుచోట్ల నిరసనలు కూడా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "సుమతీ శతకంలో చెప్పినట్లు బలమైన సర్పం కూడా చలిచీమల చేతిలో చిక్కి చనిపోతుంది. ఈ మధ్య కాలంలో పుట్టుకొచ్చిన కాక్రోచ్ పార్టీని చూడగానే నాకు సుమతీ శతకం గుర్తొచ్చింది" అని అన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులు సిద్ధంగా ఉన్నాయని, అటువంటి విభజనవాద ఆలోచనల్లో చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే ఢిల్లీలో సమావేశమయ్యామని పవన్ తెలిపారు. కోట్ల మంది కలిస్తే మంచి లేదా చెడు ఏదైనా బలమైన ప్రభావాన్ని చూపించగలరని పేర్కొన్నారు. విభజనవాదాన్ని సృష్టిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మనం అందులో భాగస్వాములం కాకుండా, ఐక్యంగా ఎదురొడ్డి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక

హైదరాబాద్ : హైదరాబాద్ నగర స్ఫూర్తికి, సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మ్యూజియం 75వ వార్షికోత్సవం, సాలార్‌జంగ్-III, 137వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విభిన్న సంస్కృతులు, విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సాలార్‌జంగ్ మ్యూజియం వివిధ సంస్కృతుల మధ్య సామరస్యానికి ప్రతీక అని, ఇది ఒక అపురూపమైన జాతీయ సంపద అని అభివర్ణించారు. జూన్ 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా మ్యూజియం విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సాలార్‌జంగ్-IIIగా ప్రసిద్ధి చెందిన మీర్ యూసుఫ్ అలీ ఖాన్ ఒక్కరే సేకరించిన అరుదైన కళాఖండాలతో ఈ మ్యూజియం ఏర్పాటైంది. 1951లో మూసీ నది ఒడ్డున ప్రారంభమైన ఈ మ్యూజియం, నేడు దేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు..

# కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు

ఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. కిషన్‌రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా బొగ్గు, గనుల రంగాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలన్న మోదీ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం కిషన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ పురోగతికి దోహదపడుతోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు కూడా కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఇరాన్ నిధులపై ట్రంప్ మెలిక..

# రూ.లక్ష కోట్ల నిధులపై వీడని ప్రతిష్టంభన

ఢిల్లీ: పశ్చిమ ఆసియాలో మూడు నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు ఫలించి, ఇరు దేశాలు ఈ ఒప్పందానికి అంగీకరించాయి. ఈ నెల 19న స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాల ప్రతినిధులు ఈ శాంతి పత్రాలపై అధికారికంగా సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందం ఖరారైన వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిపై ఉన్న నౌకాదళ ఆంక్షలను తక్షణమే ఎత్తివేస్తున్నట్లు 'ట్రూత్ సోషల్' వేదికగా వెల్లడించారు. "ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది. ప్రపంచ దేశాల నౌకలు.. మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి" అంటూ చమురు సరఫరాను పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం, లెబనాన్‌తో సహా అన్ని సరిహద్దుల్లో తక్షణ కాల్పుల విరమణ అమలులోకి వస్తుంది. అయితే, ఈ ఒప్పందం పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు ఇరాన్‌కు చెందిన నిధుల విడుదల అంశం కీలకంగా మారింది. అమెరికా ఆంక్షల కారణంగా వివిధ దేశాల్లో నిలిచిపోయిన 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ. లక్ష కోట్లు) నిధులను చర్చలకు ముందే విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌ను ట్రంప్ తోసిపుచ్చారు. ఒప్పందంలోని నిబంధనలను ఇరాన్ అమలు చేసిన తర్వాతే, పనితీరు ఆధారంగా విడతల వారీగా మానవతా దృక్పథంతో నిధులను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అణు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే మళ్లీ దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ శాంతి ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. స్విట్జర్లాండ్‌లో జరిగే ఈ సమావేశం పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా కీలక ముందడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమరావతిలో సింగపూర్ వర్సిటీ... విద్యారంగంలో ముందడుగు

ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**ఏపీలో ఏఐ, డిజిటల్ విప్లవం... గూగుల్‌తో భాగస్వామ్యం**

ముందుగా గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా అభివృద్ధి చేసే అంశంపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవడంలో సహకరించాలని చంద్రబాబు గూగుల్ క్లౌడ్‌ను కోరారు. గతంలో తాను ప్రవేశపెట్టిన రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీఎస్) వ్యవస్థను ఆధునిక క్లౌడ్ టెక్నాలజీలతో మరింత శక్తివంతం చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో గూగుల్ సహకారంతో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో సాధించిన విజయాలను వివరిస్తూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని గూగుల్‌ను ఆహ్వానించారు.

**అమరావతిలో సింగపూర్ వర్సిటీ...**

**విద్యారంగంలో ముందడుగు**

అనంతరం, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్‌తో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిని ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా అమరావతిలో ఎన్‌యూఎస్ అంతర్జాతీయ బ్రాంచ్ లేదా శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు రాజధాని ప్రాంతంలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీలో ప్రపంచ స్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సాంకేతిక, పరిశోధన సహకారాన్ని అందించాలని ఎన్‌యూఎస్‌ను కోరారు. అలాగే, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించేలా సరికొత్త విధానాల రూపకల్పనలో ఎన్‌యూఎస్‌కు చెందిన పాలసీ ఇనిస్టిట్యూట్ సహకారం తీసుకోవాలని ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా ఎన్‌యూఎస్ ప్రతినిధులు అమరావతి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో తమ భాగస్వామ్యాన్ని పలువురు ప్రొఫెసర్లు గుర్తు చేసుకున్నారు. అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి ప్రతిపాదనపై తమ బోర్డులో చర్చిస్తామని ఎన్‌యూఎస్ ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశాలతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

మొదటి పేజి తరువాయి

ఐఆర్‌ఎఫ్‌సీ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంతా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. కానీ, కిషన్‌రెడ్డి తన సహచర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. రుణం మంజూర్ కాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. జపాన్ నుంచి నిధులు కూడా వచ్చాయని రేవంత్ తెలిపారు. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజకీయంగా నష్టం జరుగుతందనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసే మెంట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాలపై కేంద్రాన్ని అడిగితే.. కింద సమస్యలు ఉన్నాయని తెలిపినట్లు వెల్లడించారు. మెట్ంరో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలిన , అంతా మేమే భరిస్తా, కేవలం ఎన్ఓసీ ఇవ్వండి కేంద్రం భాగస్వామ్యం లేకుండా నిర్మిస్తామన్నాం. సమస్యలపై చర్చిద్దామంటే కిషన్‌రెడ్డి సమయం ఇవ్వట్లేదని రేవంత్ అన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని తెలిపారు. కేవలం ఆయన నుంచి సహకారం మాత్రమే కోరుకుంటున్నానన్నారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతి, నిధులు ఇచ్చారని, విశాఖ మెట్రో నిర్మాణానికి కూడా అనుమతుల ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, హైదరాబాద్ మెట్రోకు నిధులతో అనుమతులూ లేవని విమర్శించారు. అక్కడే వివక్ష ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు. కేసీఆర్‌కు కిషన్ రెడ్డి లొంగిపోయారని రేవంత్ ఆరోపించారు. ఆయనకు అంత తెలివిలేదంటూ ఘాటు విమర్శలు చేశారు. కేటీఆర్ చెప్పినట్లు నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి వెళ్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మెట్రో నిర్మాణాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించలేదన్నారు. ఇప్పుడు దాన్ని సరిచేసుకుంటామంటే వివిధ రకాలలుగా అడ్డ తగులుతున్నారని పేర్కొన్నారు.

### పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

# అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

### అధికారులపై సీఎం రేవంత్ ఫైర్..

# అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!

హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. జూన్ 1న నిర్వహించిన సమీక్షలో ముందస్తు సూచనలు జారీ చేసినప్పటికీ, జూన్ 9న కురిసిన వర్షం సమయంలో అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే సమయంలో జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ రోడ్లపైనే ఉండి విధులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. "అవసరమైతే నేనూ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వస్తాను. ట్రాఫిక్ సమస్యలు లేదా వరదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని" ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, ఈ సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

### రాష్ట్రంలో యూఎన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

# ఏర్పాటుకు ప్రతిపాదన

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ పట్టణాల సుస్థిర అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో యూఎన్ హాబిటాట్ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని, దీనికి అవసరమైన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రతిపాదించారు. వాతావరణ మార్పుల నుంచి తీరప్రాంత నగరాలను కాపాడేందుకు ఉద్దేశించిన 'రైజప్' కార్యక్రమాన్ని ఏపీలో అమలు చేయాలని సీఎం సూచించారు. పట్టణాల్లో మురికివాడల అభివృద్ధికి పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రాం (పీఎస్‌యూపీ), వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో అర్బన్ రాస్తా ఫ్రేమ్‌వర్క్‌ను సంయుక్తంగా అమలు చేయడంపై చర్చించారు. 2028 నాటికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా ఒక టైమ్‌లైన్‌తో కూడిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవాలని చంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వాల్యూ క్యాప్చర్ ఫైనాన్సింగ్ వంటి పద్ధతుల ద్వారా స్థానిక ఆదాయ వనరులను పెంచడం, అంతర్జాతీయ వాతావరణ నిధుల సమీకరణ వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనలపై యూఎన్ హాబిటాట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఏపీతో సంపూర్ణ భాగస్వామ్యానికి వారు సుముఖత వ్యక్తం చేశారు.

## యూపీలో 'ఇండియా' కూటమిలో ఎంఐఎం చిచ్చు.. భిన్నస్వరాలు

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీని ఎదుర్కొనేందుకు ఐక్యంగా సాగాలని భావిస్తున్న ఈ కూటమిలో తాజా పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ఎంఐఎంతో పొత్తుపై ఎస్పీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. బీజేపీని ఓడించేందుకు కృషి చేసే ఏ శక్తినైనా తాము స్వాగతిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం దీనికి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒకవైపు మతతత్వాన్ని వ్యతిరేకిస్తూనే, మరోవైపు అదే తరహా రాజకీయాలు చేసే వారితో చేతులు కలపడం సాధ్యంకాదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానమే తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బీజేపీని అధికారం నుంచి దూరం చేసేందుకు తాము 'ఇండియా' కూటమిలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే ప్రకటించారు. అయితే, కూటమిలో తమకు సముచిత గౌరవం, సమాన హోదా కల్పించాలని ఆయన షరతు విధించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఆశాజనక ఫలితాలను సాధించింది. అయితే, 2027 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగా బరిలోకి దిగితే బీజేపీ వ్యతిరేక ఓట్లు, ముఖ్యంగా ముస్లిం ఓటు బ్యాంకు చీలిపోయి అంతిమంగా బీజేపీకే లాభం చేకూరుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే క్రమంలో పటిష్ఠమైన ఐక్య కూటమిని నిర్మించడంలో విపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ భిన్నాభిప్రాయాలు నిదర్శనం.

## 33 ఏళ్లలో తొలిసారి.. స్లోవేకియా గడ్డపై భారత ప్రధాని

ఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఐరోపా పర్యటనలో భాగంగా ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. 33 ఏళ్లలో తొలిసారిగా ఒక భారత ప్రధాని స్లోవేకియాలో అడుగుపెట్టారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆదివారం ఆయన స్లోవేకియా రాజధాని బ్రాటిస్లావా చేరుకున్నారు. స్లోవేకియాకు 1993లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. బ్రాటిస్లావా విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్లోవేకియా విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానార్ సంప్రదాయబద్ధంగా 'బ్రెడ్ అండ్ సాల్ట్'తో ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన భారత్-స్లోవేకియా సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోదీ 'ఎక్స్' వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు. స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, ప్రధాని రాబర్ట్ ఫికోలతో చర్చల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరపడంతో పాటు, అక్కడి అగ్రశ్రేణి వ్యాపారవేత్తలతో కూడా సమావేశం కానున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , రక్షణ, ఆటోమొబైల్, క్లీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య 1.6 బిలియన్ యూరోల వాణిజ్యం ఉంది. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈయూ, నాటో సభ్యదేశమైన స్లోవేకియాతో బంధం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# పెట్టుబడులకు భారత్ స్వర్గధామం..

అమరావతి: ఏపీలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నేడు సింగపూర్‌లోని భారత హై కమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని, ఇక్కడి కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని చంద్రబాబు కోరారు. భారతదేశానికి, సింగపూర్‌కు మధ్య ఉన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను ఈ సందర్భంగా హై కమిషనర్ అంబులే ముఖ్యమంత్రికి వివరించారు. ఈ భేటీలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. షిప్ బిల్డింగ్, సివిల్ ఏవియేషన్‌లో ఎంఆర్ఓ (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్హాల్) కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కూడా రాష్ట్రం అనుకూలంగా ఉందని వివరించారు. ఏపీలో 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారని, ప్రపంచ స్థాయి నాణ్యతతో హార్టికల్చర్ ఉత్పత్తులను పండిస్తున్నారని, వీటి ఎగుమతులకు మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగపూర్ టెక్నాలజీ రంగ అవసరాలు తీర్చగల నైపుణ్యం ఏపీ యువతకు ఉందని, రోబోటిక్స్, మెడికల్ డివైసెస్ రంగాల్లో సహకారం అందించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని చంద్రబాబు ప్రశంసించారు. పెట్టుబడులతోనే సంపద సృష్టి, ఉద్యోగ కల్పన సాధ్యమని, భారతదేశాన్ని నెంబర్ 1 చేయాలనే లక్ష్యంతో ప్రధాని పనిచేస్తున్నారని కొనియాడారు. ఒకప్పుడు 'హిందూ గ్రోత్ రేట్' అంటూ 1-2 శాతం వృద్ధిని హేళన చేసేవారని, కానీ ఇప్పుడు ప్రధాని మోదీ విధానాలతో పరిస్థితి పూర్తిగా మారిందని అన్నారు. ఆయన చొరవతోనే కియా, ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీకి వచ్చాయని గుర్తుచేశారు. అనంతరం సింగపూర్‌లోని స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, హై కమిషనర్ శిల్పక్ అంబులే కూడా పాల్గొన్నారు. భారత్ ఇప్పుడు నిద్రపోతున్న దేశం కాదని, సంస్కరణలతో దూసుకుపోతున్న అతిపెద్ద ఆర్థిక శక్తి అని చంద్రబాబు స్పష్టం చేశారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానంతో తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని, భూ సమీకరణ ద్వారా అమరావతి వంటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు రాష్ట్రంలోని స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

### ఢిల్లీ మెడలు వంచుతామంటారు..

## ఇక్కడికొచ్చి సైలెంట్ అవుతారు: పవన్ చురకలు

అమరావతి: జనసేన పార్టీ ఢిల్లీ వేదికగా 'జనసేన ప్రస్థానం-జాతీయ సమగ్రత కోసం' అనే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, అధికారం కోసం తాను పార్టీ పెట్టలేదని, దేశ సమగ్రతను కాపాడటమే జనసేన ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పన్నెండేళ్లలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని పవన్ గుర్తుచేశారు. కొన్ని పార్టీలు కేవలం తమ మనుగడ కోసం దేశ సమగ్రతను పణంగా పెడుతున్నాయని ఆరోపించారు. దేశ స్ఫూర్తిని ప్రతి తరం ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పాటుపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. తాను తెలంగాణ ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కాంగ్రెస్ పార్టీ ఏపీని విభజించిన తీరుపైనే ఆనాడు ఆవేదన వ్యక్తం చేశానని వివరించారు. విభజన జరిగిన తీరు రెండు రాష్ట్రాల మధ్య అసంతృప్తిని, అశాంతిని మిగిల్చిందని, ఆస్తుల పంపకాల వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పవన్ వ్యాఖ్యానించారు. "ఢిల్లీకి వచ్చి మెడలు వంచుతామని మాట్లాడే నాయకులు ఇక్కడికి రాగానే మౌనంగా ఉండిపోతారు" అని ఆయన అన్నారు.

## మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంది ఆ ముగ్గురే: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. "రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా? కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



సింగపూర్, నేటి శుభోదయ ::: ( మాధవరావు యెగినాటి, “నేటి శుభోదయ” అమరావతి, తెలంగాణ రాష్ట్రాల కో ఆర్డినేటర్) ::: స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు. ఈ సమావేశంలో పలు అంశాలపై కీలకంగా చర్చి నిర్ణయం తీసుకున్నారు. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి, ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారు.చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టింది. కానీ భారత్‌కు అంత సమయం పట్టటం లేదు అని తెలిపారు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయి. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయిడెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉంది. తయారీ రంగాన్ని



ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్‌లో మేం వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నాం అని తెలిపారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నాం. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నాం. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు



కేటాయించాం. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం. పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిస్తున్నాను అని చెప్పారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉంది. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నాను అని తెలిపారు.

## రిటైర్మెంట్ ఉపాధ్యాయుడు ముత్యం శ్రీనివాస్కి ఆత్మీయ ఘన సత్కారం.. !!


**ఆయన 42 సంవత్సరాల విశిష్ట సేవలకు వివిధ శాఖల ప్రముఖుల ఘన సన్మానం..**



కోరుకొండ, నేటి శుభోదయ (ప్రతినిధి);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోనాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ ఉపాధ్యాయ సేవా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకొని, పదవీ విరమణ పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ముత్యం శ్రీనివాస్ గౌరవార్థం ఆదివారం రాజా కన్వెన్షన్ సెంటర్‌లో ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఆయన 42 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, విద్యా పరిపాలకునిగా సేవలందించిన శ్రీనివాస్ పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల సౌకర్యాల మెరుగుదల, విద్యా ప్రమాణాల పెంపు కోసం అహర్నిశలు కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందారని సభలోని వక్తలు కొనియాడారు. ఆయన సేవలు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొవ్వూరు డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి స్వరూప్, కోరుకొండ మండల విద్యాశాఖ అధికారి టి కుశలవ దొర, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కె.వి. రమణారావు, పి.ఆర్.టి.యు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పల్ల రాజారావు, ఎస్.టి.యు జిల్లా నాయకులు ఎస్.జె. త్రినాథ్, యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, కత్వ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, కోరుకొండ మండలం పి ఆర్ టి యు అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎం శివన్నారాయణ, సాదే రాజు వివిధ మండలాల మండల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని శ్రీనివాస్ సేవలను ప్రశంసించారు.వక్తలు మాట్లాడుతూ, శ్రీనివాస్ ఎక్కడ పనిచేసినా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ, విద్యార్థుల సంక్షేమం మరియు పాఠశాలల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని పనిచేశారని తెలిపారు. ముఖ్యంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా కొరుకొండ మండలం కోటి గ్రామ ఉన్నత పాఠశాలలో సేవలందించిన కాలంలో పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఈ సందర్భంగా కోటి గ్రామ మాజీ సర్పంచ్ దుర్గారావు, టీడీపీ నాయకులు వీరబాబు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి శ్రీనివాస్ అందించిన సేవలు గ్రామ ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొని ఆయనకు ఘన సన్మానం నిర్వహించి పదవీ విరమణ అనంతర జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.

## ప్రాచీన కళలకు 'రామసేన' అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు

**కళా సమ్మేళనం కార్యక్రమానికి రెండు లక్షలు రూపాయలు విరాళం..!!**



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); మన సంస్కృతికి మరియు చరిత్రకు మూలధారమైన ప్రాచీన కళలను పరిరక్షించడం కోసం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు తన వంతు ప్రోత్సాహం అందిస్తున్నారని, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు అన్నారు. రాజమండ్రి రివర్ బే లోని ఆహ్వానం ఫంక్షన్ హాల్ లో ఈ నెల 11 నుంచి 14 తేదీ వరకు శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్ర వారి కళా సమ్మేళనం (2026) ఇంటర్నేషనల్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి ముఖ్య అతిథులు పాల్గొన్నారు. తొలిత వారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆడిటోరియంలో వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన, పలు డ్యాన్స్,సాంస్కృతిక, మ్యూజిక్ కార్యక్రమాలను తిలకించారు. ఈ కళా సమ్మేళనం డాన్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు రెండు లక్షలు రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, నాగరమేష్, వీరాంజలి, దేశాల నరేష్, రాయపాటి సత్యనారాయణ, మళ్ల అధిశేషు, గనిరాజు, ధార శ్రీను, బుల్లబ్బాయి, కాకర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# ధర్మవరంలో ఘనంగా బిజినెస్ కమ్యూనిటీ థీమాటిక్ యోగా కార్యక్రమం

**- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



ధర్మవరం, నేటి శుభోదయ ::: ధర్మవరంలో వ్యాపార థీమ్ తో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు. ధర్మవరం పట్టణంలోని సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో రాష్ట్ర ప్రజలందరూ యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకొని జీవన విధానంగా మార్చుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “యోగాంధ్ర 2026” లో భాగంగా సోమవారం ధర్మవరం పట్టణంలో చేనేత (వీవర్స్), వ్యాపార, వాణిజ్య వర్గాల కోసం ప్రత్యేక థీమాటిక్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి తో పాటు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ యోగాను ఒక జీవన విధానంగా మార్చుకోవాలి అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు . అనారోగ్యం బారిన పడిన తర్వాత ఇబ్బంది పడేకంటే, అసలు వ్యాధులు దరిచేరకుండా చూసేందుకు యోగా ఒక అద్భుతమైన నివారణోపాయంగా ఉపయోగపడుతుంది.భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 45 నిమిషాల నుండి గంట పాటు యోగా సాధన చేయాలని కోరారు.ఈ సంవత్సరం పొదుపు చర్యలను పాటిస్తూ, ఖర్చులను తగ్గించుకొని 15 రోజుల పాటు వివిధ వర్గాల (వైద్యులు, పోలీసులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, వ్యాపారస్తులు మొదలైన వారితో) థీమ్ ఆధారితంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమైన ‘ఆరోగ్యాంధ్రప్రదేశ్’ నిర్మాణానికి, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ‘వికసిత భారత్’ సంకల్పానికి యోగా ఎంతో దోహద పడుతుందన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, వెబ్‌సైట్లలో లభించే యోగా చిట్కాలను చూసి ఇంట్లోనే సులభంగా సాధన చేయవచ్చని పేర్కొంటూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పర్యావరణం, జంతువుల కదలికలను పరిశీలించి మన రుషులు మకరాసనం, మర్కటాసనం, మార్జాలాసనం, ఉష్ట్రాసనం, శశాంకాసనం, వృక్షాసనం వంటి వివిధ యోగాసనాలను రూపొందించారని, ప్రకృతితో మమేకం కావడానికి యోగా ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు.కేవలం 15 నిమిషాల యోగా సాధనతోనే శరీరంలో రక్తప్రసరణ మెరుగవుతుందని, ప్రాణవాయువు అంది శరీరం ఉత్తేజితం, ప్రశాంతతను పొందుతుందని వివరించారు. ఈ శారీరక సౌకర్యం, ఆనందం డబ్బులు ఇస్తే లభించేవి కావని, నిరంతర సాధనతోనే సాధ్యమన్నారు. ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ఉచిత లింకులను అందిస్తూ ఆన్‌లైన్ క్లాసుల ద్వారా కోట్లాది మందికి యోగాను చేరువ చేస్తోందని, తాను కూడా ఆన్‌లైన్ ద్వారానే యోగాను ఫాలో అవుతున్నానని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఒక్కరిలో సంకల్పం పెరిగినప్పుడే ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య తగ్గి దేశ ఆరోగ్యం మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, రోజుకు కనీసం అరగంట పాటు యోగా చేస్తామని ప్రతిజ్ఞ పూనాలని పిలుపునిచ్చారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా ఎదురవుతున్న రకరకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలకు యోగా ఒక అద్భుతమైన పరిష్కారమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే ఈ థిమాటిక్ యోగా ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే నేడు ధర్మవరంలోని చేనేత (వీవర్స్), వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రతినిధులతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలియజేశారు.ఈ విశేష కార్యక్రమంలో ధర్మవరం ఇన్‌చార్జ్ ఆర్డీఓ సువర్ణ,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, జిల్లా అధికారులు ,స్థానిక వ్యాపార ప్రముఖులు, యోగా సాధకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.



# జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా గోల్డ్ లోన్ బాధితుల చలో ఏలూరు కలెక్టరేట్

**- మా బంగారం మాకు ఇప్పించండి అంటూ జిల్లా కలెక్టరేట్ ముందు గోల్డ్ లోన్ బాధితులు ధర్నా - బంగారం తాకట్టు పెట్టి లోన్ తీసుకున్న రైతులు, ఇతర బాధితులకు తక్షణం న్యాయం చేయాలి**

**- గోల్డ్ గోల్ మాల్ పై సమగ్ర విచారణ జరపాలి**

**--- దొంగలను కఠినంగా శిక్షించాలి**




ఏలూరు, నేటి శుభోదయ ::: జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా గోల్డ్ లోన్ బాధితులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం చలో ఏలూరు కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మా బంగారాన్ని మాకు ఇప్పించండి అంటూ జిల్లా పరిషత్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టరేట్ ముందు గోల్డ్ లోన్ బాధితులు ధర్నా నిర్వహించారు. సమగ్ర విచారణ వెంటనే పూర్తి చేసి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కుటుంబ వ్యవసాయ అవసరాల నిమిత్తం జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా లో రైతులు, చిరు వ్యాపారులు, వృత్తిదారులు, ఇతరులు అనేక మంది తమ బంగారాన్ని తాకట్టు పెట్టి గోల్డ్ లోన్ తీసుకున్నారని, వారు తాకట్టు పెట్టిన గోల్డ్ గోల్ మాల్ అయిందన్నారు. వారు తాకట్టుకు వచ్చిన బంగారం బ్యాంకులో లేదని, ఆ బంగారం స్థానంలో ఇనుప వస్తువులు, సుద్ద ముక్కలు వంటివి పెట్టి తాకట్టు పెట్టిన బంగారాన్ని బ్యాంకు అధికారులే దొంగతనం చేశారని చెప్పారు. తప్పుడు పత్రాలు, ఆన్ లైన్ లో తప్పుడు లెక్కలు చూపించి జిల్లాలో అతిపెద్ద స్కాం కు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న బంగారాన్ని ఎంతో నమ్మకంతో తాకట్టు పెడితే బ్యాంక్ అధికారులే గోల్ మాల్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. గత పది రోజులుగా పెద్ద ఎత్తున బ్యాంకు ముందు ఆందోళన చేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సమగ్ర విచారణ వెంటనే పూర్తి చేసి గోల్డ్ లోన్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల బంగారం బాధితులకు అందే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా గోల్డ్ లోన్ బాధితులకు సిపిఎం అండగా ఉంటుందని ప్రకటించారు. బాధితుల పోరాటానికి మద్దతు తెలియజేశారు. బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారానికి గ్యారెంటీ లేకపోవడం దారుణమన్నారు. ఈ బ్యాంకులో 2,600 వరకు ఖాతాలు ఉంటే ఇప్పటివరకు 1600 ఖాతాదారులను విచారణ చేశారని, మిగిలిన విచారణ వెంటనే పూర్తి చేయాలని కోరారు. 82 బ్యాంకు ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారంలో 4 కేజీల 28 గ్రాములు కనిపించడం లేదని, మిగిలిన ఖాతాదారుల బంగారం కూడా పరిశీలిస్తే ఆ బంగారం 15 కేజీల వరకు ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపదిక బాధితుల బంగారాన్ని బాధితులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలన్నారు.గోల్డ్ లోన్ బాధితులు కొప్పుల సత్తిరెడ్డి,గెడా ఆనంద ప్రసాద్, తలారి నందిని, ఆర్.దుర్గా భవాని, గోలి కృష్ణారెడ్డి, కోనా రాము తదితరులు మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేము తాకట్టు పెట్టిన బంగారం కనిపించడం లేదని, బ్యాంకు అధికారులే మా బంగారాన్ని కాజేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ అవసరాల కోసం బంగారాన్ని తాకట్టు పెడితే మమ్మల్ని మోసం చేయడం దారుణమని, గత పది రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మా బంగారాన్ని మాకు ఇప్పించేలా బ్యాంక్ ఆఫ్ బరోడా ఉన్నతాధికారుల నుండి మాకు స్పష్టమైన హామీ పత్రాలు ఇప్పించాలని, వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### బంగారం గోల్ మాల్ పై స్పందించిన జిల్లా కలెక్టర్

ధర్నా అనంతరం గోల్డ్ లోన్ బాధితులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం,సిపిఎం నాయకులు జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి స్పందిస్తూ గోల్డ్ లోన్ బాధితులకు బంగారం అందేలా బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ హామీ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కు ఆమె ఆదేశం జారీ చేశారు. సమగ్ర విచారణ పూర్తి చేస్తున్నామని న్యాయం చేస్తామని కలెక్టర్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన గోల్డ్ లోన్ బాధితులు కలగర రామారావు, సిహెచ్.సత్యనారాయణ, కొఠారి చంద్రశేఖర్, ఆరేపల్లి రామారావు,మల్లాపు లక్ష్మీపార్వతి, బి.వెంకటేశ్వరరావు, గుత్తా సీతారాములు, చిలుకూరి అచ్చిరెడ్డి, పొరపాటి ఏసు, నాకిరెడ్డి లక్ష్మీప్రసన్న, సిహెచ్.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల కళ్ళలో ఆనందం చూడాలన్నదే నా కోరిక అన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**- దివ్యాంగులకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం అండగా ఉంటుంది- నారా లోకేష్ యువగళం హామీ తోనే దివ్యాంగులకు, వయో వృద్ధులకు సహాయ పరికరాలు- దివ్యాంగులను అక్కున చేర్చుకొని ఆధరించింది దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు- వేలాది మంది దివ్యాంగులు, వయో వృద్ధులకు అన్నంపెట్టి సహాయ పరికరాలు అందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**






నంద్యాల, నేటి శుభోదయ ::: వేలాది మంది దివ్యాంగులు, వయో వృద్ధుల హర్ష ధ్వనుల మధ్య నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిల చేతుల మీదుగా ఒకేసారి 4 కోట్ల రూపాయల విలువగల, మూడు వేల మందికి పైగా దివ్యాంగులు, వయో వృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాలు వారికి అన్నం పెట్టి పంపిణీ చేశారు. నంద్యాల పట్టణంలోని టేక్కె వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో సోమవారం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడీఐపీ పథకం కింద దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి రాజకుమారి, దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ ల, ఉమ్మడి కర్నూలు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాతిమా, నంద్యాల ఆర్ డి ఓ చల్లా. విశ్వనాధ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి. శేషన్న, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాధ్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్. రవికృష్ణ ల చేతుల మీదుగా దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్ళు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, తదితర సహాయక పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వికలాంగుల కళ్ళలో ఆనందం చూడాలనే కోరిక ఉందని, కేంద్రంలోని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ల సహాయ సహకారం, వారి సలహా సూచనల మేరకు నంద్యాల ప్రజలకు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ మేరకు ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఈ రెండేళ్లలో రాష్ట్రంలో మొట్టమొదటి సారి నంద్యాల జిల్లాకు ఒకేసారి 4 కోట్ల రూపాయల విలువగల, మూడు వేల మందికి పైగా దివ్యాంగులు, వయో వృద్ధులకు వారి అవసరాలకు అనుగుణంగా వీల్ చైర్లు, ట్రై సైకిళ్ళు, బ్యాటరీ సైకిళ్ళు, మూగ. చెవిటి వారికి వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ తదితర సహాయ పరికరాలు అందజేయడం తాను అదృష్టంగా భావిస్తున్నాను అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గతంలో కొన్ని ప్రభుత్వాలు వికలాంగులను భారంగా చేస్తే, తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం వికలాంగులను భాద్యతగా చూస్తూ వారి అభివృద్ధికి అండగా నిలుస్తుందన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్ వికలాంగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు దివ్యాంగుల పెన్షన్ రెండు వేల రూపాయల నుంచి ఏకంగా ఆరు వేలు పెంచి ఇంటి వద్దకే ప్రతి నెల ఒకటవ తేదీననే ఇస్తున్నారని, 100 శాతం వికలత్వం కలిగి, ఇతరుల సహాయంతో ఉన్న దివ్యాంగులకు నెలకు రూ. 15 వేల పెన్షన్ అందిస్తూ, ఈ రెండేళ్ల పాలనలో రెండు సార్లు వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడం, ఆర్ టి సి బస్సులో ఉచిత ప్రయాణం కల్పించి వికలాంగుల పక్షపతిగా పాలన చేస్తున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. వైసీపీ గత పాలనలో జీ ఓ తెచ్చి దివ్యాంగ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్ లేకుండా చేశారాని ఆమె విమర్శలు చేశారు. వైసీపీ మెగా డి ఎస్సీ పై అవస్థవ ప్రచారం చేస్తోందని, మహిళలను కించపరిచే విధంగా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని, వారిపై రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో మహిళలు ఫిర్యాదు చేయబోతున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఎంపీ నిధులతో, జిల్లా కలెక్టర్ సహకారంతో దివ్యాంగుల కమ్యూనిటీ నూతన హాల్ నిర్మాణం చేస్తానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చిన తనకు వికలాంగులు ఫోన్ చేయాలనీ, మీ సమస్యకు తాను పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధసి కురువ ఎల్లాప్ప, నంద్యాల జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, డివిజన్ వికలాంగుల సంఘం అధ్యక్షులు ఎం పి వి రమణయ్య, నాయకులు డి పి మస్తాన్, తదితర వికలాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రైతు ఫిర్యాదుపై వెంటనే స్పందించిన కలెక్టర్

**– వాట్సాప్ సందేశంతో కదిలిన అధికార యంత్రాంగం**

**– వివాదాస్పద భూమి సర్వేపై విచారణకు ఆదేశాలు**



నంద్యాల జిల్లా, మహానంది, నేటి శుభోదయ ::: ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం వేగంగా స్పందిస్తున్న మరో ఉదాహరణ నంద్యాల జిల్లాలో చోటు చేసుకుంది. మహానంది మండలం తమడపల్లి గ్రామానికి చెందిన రైతు భాష్యం రామచంద్రుడు తన భూమికి సంబంధించిన సమస్యపై నంద్యాల జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయగా,కలెక్టర్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు విచారణ చేపట్టాలని ఆదేశించారు.రైతు భాష్యం రామచంద్రుడు సర్వే నంబర్ 267/2 లోని భూమికి సంబంధించి గౌరవ న్యాయస్థానాల్లో వివాదం పెండింగ్‌లో ఉందని,అలాంటి పరిస్థితుల్లో రెవెన్యూ మరియు సర్వే శాఖ అధికారులు కొలతల ప్రక్రియ చేపట్టడం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే భూమికి సంబంధించి కోర్టుల తీర్పులు,అధికారిక రికార్డులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సర్వే నిర్వహణకు నోటీసులు జారీ చేయడం సరికాదని రైతు ఆరోపించారు. భూ వివాదం కోర్టు పరిధిలో ఉండగా తొందరపాటు చర్యలు తీసుకోవడం వల్ల రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఫిర్యాదు అందుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తి వివరాలను సేకరించాలని సంబంధిత రెవెన్యూ,సర్వే అధికారులను ఆదేశించినట్లు సమాచారం. వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కూడా సూచించినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ స్పందనపై రైతు సంఘాలు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వాటిపై వెంటనే చర్యలు తీసుకుంటున్న కలెక్టర్ వైఖరి అభినందనీయమని పేర్కొంటున్నారు.భూ హక్కులు,న్యాయస్థానాల ఆదేశాలు పరిరక్షించే విధంగా పారదర్శక విచారణ నిర్వహించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా రైతు భాష్యం రామచంద్రుడు తన సమస్యను పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియాకు కృతజ్ఞతలు తెలిపారు. విచారణ నిష్పక్షపాతంగా జరిగి న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని గ్రామస్థులు వ్యక్తం చేశారు.

# మదురపూడి విమానాశ్రయశీ నుండి 2025-26 లో 5.60 లక్షల మంది ప్రయాణాలు..!!

**– 'విమానయాన ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత..'**

**– యాత్రి సువిధా దివస్‌లో విమానాశ్రయ అభివృద్ధి, సేవలపై అవగాహన..**

**– ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ కె. ప్రీతి**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);విమానయాన ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించడంలో విమానాశ్రయాలు కట్టుబడి ఉన్నాయని రాజమహేంద్రవరం విమానాశ్రయ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ప్రీతి అన్నారు. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యాత్రి సువిధా దివస్--2026' కార్యక్రమాన్ని సోమవారం మధురపూడి విమానాశ్రయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విమానయాన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రయాణికులకు అందుతున్న సేవలు, సమాజాభివృద్ధిలో విమానాశ్రయాల పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు. గత పదేళ్లలో రాజమహేంద్రవరం విమానాశ్రయం ప్రయాణికుల రద్దీతో పాటు కార్గో రవాణాలోనూ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు.2013-14లో 1.13 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయ సేవలను వినియోగించుకోగా, 2025-26 నాటికి ఆ సంఖ్య 5.60 లక్షలకు చేరిందని పేర్కొన్నారు. కార్గో రవాణా కూడా గణనీయంగా పెరిగిందన్నారు. పెద్ద విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే విస్తరణ చేపట్టడంతో ఎయిర్‌బస్ 321, బోయింగ్ 737 మ్యాక్స్ వంటి విమానాలను నిర్వహించే సామర్థ్యం లభించిందని వివరించారు.




విమానాశ్రయంలో 1 మెగావాట్ సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాల్లో గణనీయమైన భాగాన్ని తీర్చుకుంటున్నామని తెలిపారు. కొత్త టెర్మినల్ భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రయాణికుల సామర్థ్యం భారీగా పెరగడంతో పాటు గోదావరి పుష్కరాలు--2027 అవసరాలను సమర్థంగా తీర్చగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.యాత్రి సువిధా దివస్ సందర్భంగా ప్రయాణికులకు స్వాగతం పలకడంతో పాటు మొక్కల పంపిణీ, మొక్కల నాటడం, హౌస్‌కీపింగ్ సిబ్బంది సత్కారం, ఉచిత ఆరోగ్య పరీక్షలు, రక్తదాన శిబిరం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రయాణికుల సేవలతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత కార్యక్రమాలకు కూడా విమానాశ్రయం ప్రాధాన్యత ఇస్తోందని కె. ప్రీతి తెలిపారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయం అధికారులు, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

# "పేదబడుగులపెన్నిధి వంగవీటి మోహన్ రంగా"




తాడేపల్లిగూడెం జూన్ 15 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ) పేదలు,బలహీన వర్గాల పెన్నిధిగా వంగవీటి మోహన్ రంగా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక గొల్లగూడెం సెంటర్లో రంగా కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విజయవాడలో రంగా అభిమానుల్లో అధిక శాతం బడుగు బలహీన వర్గాలు, ముస్లింవర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారని అన్నారు. రంగా రాష్ట్ర స్థాయిలో ప్రజల అభిమానం పొంది, ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎదుగుతున్న క్రమంలో ఆనాటి రాజకీయ కుట్రలకు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగాను ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ముద్ర వేసేందుకు ఎంతోకాలంగా ప్రయత్నం జరిగిందని, ప్రజలు మాత్రం కుల మతాలకు అతీతంగా ఆయనను అందరివాడుగా అభిమానిస్తున్నారని అన్నారు.రంగా ఆశయ సాధనకు, బడుగు వర్గాల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసీ,మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు పాల్గొని రంగాకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పైబోయిన రఘు,బొడ్డు సాయి బాబా,ద్వారంపూడి వేణుగోపాల రెడ్డి,కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, చాపల రమేష్, వర్తనపల్లి కాశి, నీలపాల దినేష్, మాకా శ్రీనివాస్,సజ్జా సుబ్బు,భోగిరెడ్డి రాము, దస్తగిరి, పీతల బుచ్చిబాబు, ఎంట్రపాటి రాజు,సింగం సుబ్బారావు, వాడపల్లి సుబ్బరాజు, శీలి వెంకటేశ్వర రావు,వీర్ల సత్యనారాయణ, పడాల శ్రీను,తెన్నేటి జగజ్జీవన్,యాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రూడా చైర్మన్, టీడీపీ ఇంచార్జి బొడ్డు వెంకటరమణ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన సీతానగరం సబ్ ఇన్స్పెక్టర్ ఎల్.శ్రీనివాస్..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); సీతానగరం పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ఐ. ఎల్.శ్రీనివాస్ రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వెంకట రమణ చౌదరి తో పలు అంశాలపై చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణ తో పాటు నాటు సారా, గంజాయి వంటివి అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వెంకట రమణ చౌదరి సూచించారు.

# "తోట గోపిపై విమర్శలు సరికాదు"



తాడేపల్లిగూడెం జూన్ 15 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: ప్రజా సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేస్తున్న సీనియర్ నాయకుడు తోట గోపి పై లేనిపోని అసత్య ప్రచారం చేయడం తగదని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జగన్నాధపురం కర్ర చెరువు నీటి సంఘం అధ్యక్షుడు బొల్లిన రామకృష్ణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం,జగన్నాధపురంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. అనేక ప్రజా సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేసే విధంగా తోట గోపి సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షులు మొగలపు రాజు, టిడిపి నాయకులు పేరిచర్ల వేంకట పతిరాజు, తమ్మాబత్తుల యేసు తదితరులు పాల్గొన్నారు.

# "ఉపాధి కూలీలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్"




పెంటపాడుజూన్ 15 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):: పెంటపాడు మండలం ఏపీ వ్యవసాయ కార్మిక రైతు సంఘం, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దర్శి పర్రు గ్రామంలో ఉపాధి పనులు ప్రదేశంలో పర్యటించి ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కూలీ 307/- రూపాయలు రావడంలేదని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం 2005లో వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిందని అన్నారు. దీన్ని కాపాడుకోవడం కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కూలీలంతా చైతన్యవంతంగా పోరాడాలని అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ రోజున ఉపాధిలో కూలీలు అనేకమంది ప్రజలు వివిధ భాగాలలో పనిచేస్తున్నారని ముఖ్యంగా మహిళలకు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఉపాధి పనిలోకి వెళుతున్నారని అలాంటి ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చడం ప్రభుత్వానికి తగదన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నాయకులు ఉపాధి హామీకి నిధులు తీసుకురావడానికి కేంద్రంతో రాజీలేని పోరాటం చేయాలని అప్పుడే కూలీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కొత్తగా తీసుకొచ్చిన విబి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోటి ముత్యాలరావు, గారపాటి భాస్కరావు, సుంకర ప్రియా బాబు, బొట్టు రాణి, సుంకర వరలక్ష్మి, పైడి దీనకళ బొట్టు మంగమ్మ, బొట్టు రామారావు, సయ్యద్ సలీం, బి.కటాక్షం తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుపై రాజకీయాలు మానాలి



తిరుపతి, జూన్ 15,(నేటి శుభోదయ) : డీఎస్సీ క్రీడల కోటా నియామకాలపై కొందరు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని చంద్రగిరి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు భరత్ చౌదరి అన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. మేధావుల ముసుగులో రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. సమాజంలో అపోహలు, విభేదాలు సృష్టించే వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల భవిష్యత్తు, ముఖ్యంగా యువత అవకాశాలతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భరత్ చౌదరి సూచించారు.

# ఇంద్రకీలాద్రిపై 'మూడంచెల భద్రతా తనిఖీ' విధానం అమలుకు

**నగర పోలీస్ అధికారులు, వైదిక సిబ్బందితో ఈవో ఉన్నత స్థాయి సమావేశం.**



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించడంతో పాటు, ఆలయ భద్రతను పెంచేందుకు పటిష్టమైన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రానున్న రోజుల్లో విశేష ఉత్సవాలు ఉన్నందున, దేవస్థాన భద్రత, భక్తుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం ఉదయం దేవస్థాన కార్యాలయంలో నగర పోలీస్ అధికారులు, వైదిక సిబ్బంది, ఆలయ అధికారులతో ఈవో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఈఓ శీనా నాయక్ మాట్లాడుతూ 'మూడంచెల భద్రతా తనిఖీ' గురించి,క్షేత్రస్థాయిలో ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా డివోటీ ఫ్రెండ్లీ తరహాలోనే ఇంద్రకీలాద్రిపై 'మూడంచెల భద్రతా తనిఖీ' విధానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నామని,ఇటీవల కాలంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ముఖ్యంగా ఆర్జిత సేవల్లో పాల్గొనే వారి డిమాండ్ పెరగడం వల్ల క్యూలైన్ల నిర్వహణ సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, రద్దీ సమయంలో ఎలాంటి గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు, ప్రతి భక్తుడిని మూడు వేర్వేరు పాయింట్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఆలయ ప్రాంగణంలోకి అనుమతిస్తారు.?దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు ఈ తనిఖీ కేంద్రాల వద్ద తమ టికెట్లను చూపించాల్సి ఉంటుంది. అదే సమయంలో, టికెట్ లేని సామాన్య భక్తులకు సర్వదర్శనం లైన్ ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో స్పష్టం చేశారు.?ఆలయ ప్రాంగణంలో భక్తులు సెల్ ఫోన్ల వాడకం వలన పలు ఇబ్బందులు, భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని ఈవో పేర్కొన్నారు. దీని నివారణకు గానూ ఆలయంలో 'సెల్ ఫోన్ల నిరోధక వ్యవస్థ'ను ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులకు దీనిపై పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే సెల్ ఫోన్లు డిపాజిట్ చేసుకునేందుకు, భక్తుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రస్తుతం లగేజ్ తోనే కొంత మంది భక్తులు ఆలయం లోకి రావడం గమనించామని, కొత్త విధానం అమలుతో భక్తులు లగేజ్ తో ఆలయం లోకి రాకుండా ప్రత్యామ్యాయ ఏర్పాటు చేస్తామని, లగేజ్ స్కానర్ ఏర్పాటు పరిశీలన ఉందని శీనా నాయక్ వెల్లడించారు..సమావేశం అనంతరం ఈవో వి.కె. శీనా నాయక్, పోలీస్ ఉన్నతాధికారులు జి. రామకృష్ణ, దుర్గారావు, వన్ టౌన్ సిఐ గుణ రామ్, దేవస్థానం వైదిక సిబ్బందితో కలిసి కొండపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధి విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవాదాయ శాఖ,నగరపోలీస్, రెవిన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, ధర్మకర్తల మండలి లతో సంయుక్తముగా ముందుకు సాగుతామని ఈవో వివరించారు.'మూడంచెల భద్రతా వ్యవస్థ'ను పటిష్టంగా అమలు చేసేందుకు వీలుగా క్యూ లైన్లు, ప్రవేశ ద్వారాల వద్ద ఉన్న భద్రతా డ్యూటీ పాయింట్లను పరిశీలించి, అవసరమైన చోట్ల మార్పులు చేర్పులు చేయాలని దేవస్థానం సెక్యూరిటీ విభాగాన్ని ఆదేశించారు. ప్రోటోకాల్ విధానాన్ని మరింత పటిష్టం చేస్తూ, సామాన్య భక్తుల దర్శనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడటమే ఈ నూతన భద్రతా విధానం యొక్క ముఖ్య ఉద్దేశమని ఈవో వివరించారు.ప్రోటోకాల్ విధానంలో మార్పు విషయం లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించటానికి ప్రయత్నం చేస్తున్నామని ఈవో పేర్కొన్నారు.

# అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వియంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం నగరంలోని కృష్ణవేణి స్కూల్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పటమట నిర్మలా కాన్వెంట్ పరిసర ప్రాంతాల్లో తరచూ ఏర్పడుతున్న వర్షపు నీటి నిల్వలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చేపట్టిన ఈ డ్రైన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి డ్రైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. మరోవైపు నగరంలో డీసిల్టింగ్ ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతుండాలని, చిన్న డ్రైన్ నుంచి అవుట్ఫాల్ట్ డ్రైన్ వరకు ఎటువంటి వ్యర్థాలు, సిల్ట్ లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మాచవరం, వాంబే కాలనీ, సింగ్ నగర్, పున్నయ్య కాలనీ, బీఆర్‌టీఎస్ రోడ్, కొత్త వంతెన సెంటర్ తదితర ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్, బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) నిర్వహిస్తున్న ఇంటింటి తనిఖీలు, ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి బీఎల్వోపై ఉందన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లు, డూప్లికేట్ నమోదులు లేదా అనర్హుల పేర్లు ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సహకారంతో ధృవీకరించి ఖచ్చితమైన జాబితాను రూపొందించాలని ఆదేశించారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చూడడంతో పాటు, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ ఓటు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన, తప్పులులేని మరియు విశ్వసనీయమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, ఏ ఈ ఆర్ వో లు పి.సత్యకుమారి, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర




విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):-ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు.ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 24 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 10, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, రెవెన్యూ 3, ఇంజనీరింగ్ 6, ప్రజారోగ్య శాఖలకు సంబంధించిన 2, యూసీడి 1, హార్టికల్చర్ 2 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన, శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్క్స్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి హెచ్ రత్న బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్ లలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కలెక్టర్ కు వినతి పత్రం అందచేత



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):- భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ఆదేశాల మేరకు కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కొల్లి నాగేశ్వర రావు ఆధ్వర్యంలో విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో రైతు బజార్ లలో కొన్ని చోట్ల మౌలిక వసతుల కొరత, పరిమిత స్థలం, త్రాగు నీరు, పారిశుధ్యం, పార్కింగ్, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు లేకపోవటం, రైతుల కోసం సరైన షెడ్లు లేకపోవటం. రైతు బజార్ల సంఖ్య తక్కువగా ఉన్నందున జనాభా ప్రాతి పదికన కొత్తవి ఏర్పాటు చేసే విధంగా ఆలోచన చేయాలని, అలాగే రైతులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని కొన్ని చోట్ల రైతులకంటే మధ్యవర్తుల ప్రభావం పెరిగిందని, డిజిటల్ చెల్లింపులు, ఆన్లైన్ ఆర్డర్, హోం డెలివరీ వంటి ఆధునిక సౌకర్యాల వైపు ఆలోచన చేయాలని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు అందేలా చేయటం, రైతులకు గిట్టుబాటు ధర వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు అందించటం ఎంతో ఉపయోగకరంగా ఉందని, రైతు బజార్ల పెంపుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం, వ్యవసాయ ఆధారిత ఉపాధి పెంపుదలకు కీలకమైన ప్రజా సంక్షేమ కార్యక్రమం అని భారతీయ జనతా పార్టీ అభిప్రాయం అని,ఈ అంశాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఐఏఎస్. జి.లక్ష్మీశా ను కలిసి కొల్లి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బొమ్మదేవర శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ పోసాని గురునాథం, సీనియర్ నాయకులు రావూరి రమేష్, కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సోమశేఖర్, తల్లపురెడ్డి నాగిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం. యోగా అందరికీ అవసరం

జనసేన నాయకురాలు తిరుపతి అనూష



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):- రాష్ట్ర ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగాను ప్రతి ఇంటికీ చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం భవానీపురం హెచ్‌బీ కాలనీలో ఉన్న గద్దె రామ్మోహనరావు పార్క్‌లో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష ముఖ్య అతిథిగా పాల్గొని యోగా సాధన చేశారు. ఉదయం వేళల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై యోగాసనాలు, ప్రాణాయామాలు చేశారు. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో పాల్గొన్న వారందరూ వివిధ రకాల యోగా భంగిమలను అభ్యసించారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత కోసం యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని శిక్షకులు వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి అనూష మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యల నుంచి బయటపడటానికి యోగా సమర్థవంతమైన మార్గమని పేర్కొన్నారు. యోగా భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అపూర్వమైన జీవన విధానమని ఆమె అన్నారు. నిత్య జీవితంలో కనీసం కొంత సమయం కేటాయించి యోగా చేస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పొందవచ్చని అనూష తెలిపారు. నేటి తరుణంలో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ యోగా అవసరమైందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగంతో ఎక్కువ సమయం కూర్చునే జీవనశైలికి అలవాటు పడుతున్న నేపథ్యంలో యోగా ద్వారా శారీరక చురుకుదనం పెంపొందించుకోవాలని అనూష సూచించారు. మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "యోగాంధ్ర" కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తిరుపతి అనూష అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించి, ప్రతి ఇంటిలో యోగా సంస్కృతిని అలవర్చేలా చర్యలు తీసుకోవాలని అనూష కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి యోగా సాధనను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని అనూష పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, యోగా శిక్షకులు, కాలనీవాసులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే "యోగాంధ్ర" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వారు వెల్లడించారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా వాక్

- లకారం ట్యాంక్‌బండ్ వద్ద అవగాహన కార్యక్రమం




ఖమ్మం, నేటి శుభోదయ :::జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద యోగా వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మంలోని ఆయుర్వేద, హోమియోపతి, యునాని వైద్యశాలల ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యోగా ఇన్‌చార్జి డాక్టర్ కె. పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఖమ్మం యోగా ధ్యాన సమాఖ్యకు చెందిన ఎం. లక్ష్మీనారాయణ, డాక్టర్ వై. ఉప్పేందర్, డాక్టర్ బి. సుధాకర్, డాక్టర్ కనకలక్ష్మి, జి. వీరయ్య, ఎల్. వజ్రమ్మ, పి. సూర్యకళ, పి. క్రాంతితో పాటు మూడు వైద్యశాలలకు చెందిన యోగా శిక్షకులు, వివిధ యోగా కేంద్రాల ప్రతినిధులు, ఉదయపు వాకింగ్‌కు వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## పేదల ప్రాణాల కోసం రక్తదానం చేసిన నూతి సత్యనారాయణ గౌడ్, కిలారు అనిల్ కుమార్



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమం సేవా భావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ కుమార్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. పేద ప్రజలకు అవసరమైన సమయంలో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం అత్యంత విలువైన సేవ అని వారు పేర్కొన్నారు.ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం కాంగ్రెస్ పార్టీ యొక్క సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించారు. "రక్తదానం -- మహాదానం, ఒకరి రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదు" అనే సందేశంతో పలువురు యువకులు కూడా రక్తదానానికి ముందుకు వచ్చారు.పేద ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది.



## కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ "బీసీల రక్షణ చట్టం" తక్షణమే ప్రకటించాలి

-యాదవులపై జరిగిన అత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించిన యాదవ నేతలు



ఒంగోలు,జూన్ 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) యాదవులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగినటువంటి యాదవ సామాజిక వర్గం ఐక్యవేదిక నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి చల్లా హరిబాబు యాదవ్, మిరియం శీను యాదవ్ లు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన అనేకమంది వివిధ సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గం పైన జరిగినటువంటి దాడిని తీవ్రంగా ఖండించారు.ఈ సమావేశంలో మాట్లాడినటువంటి వారిలో అధిక శాతం మంది కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ "బీసీ రక్షణ చట్టం" తక్షణమే తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొర్రెలు మేకల పెంపకం దారులతో పాటు పశువుల పెంపకం దారులకు కూడా ప్రతి గ్రామపంచాయతీలో పశువుల పోరంబోకు భూమిని కేటాయించాలని, ఇప్పటికే కేటాయించినటువంటి భూములు అన్యాక్రాంతమైనటువంటి వాటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని ఆయా వర్గాల వారికి కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగే బీసీ అట్రాసిటీ చట్టం తీసుకొస్తామని ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినటువంటి విధంగా తప్పనిసరిగా ఈదుముడిలో జరిగినటువంటి సంఘటన నుంచే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేస్తూ సెక్షన్లను విధించాలని పలువురు అభిప్రాయపడ్డారు. మరికొందరు మాట్లాడుతూ ఇతర కులాల వారి యొక్క మనోభావాలను అధికారులు అర్థం చేసుకొని హత్యాయత్నం చేసినటువంటి వారి యొక్క బృందం పైన నూతన చట్టాల ప్రకారంగా హత్యాయత్నం కేసు సెక్షన్లను విధించాలని, దెబ్బలు తిన్నవారి కంప్లైంట్ మేరకు దాడి చేసిన వారి మీద పెట్టిన సెక్షన్లనే దాడి చేసిన వారు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా గాయపడిన వారి మీద కూడా అవే సెక్షన్లు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు సభాముఖంగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి యాదవ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ చైర్మన్ మద్దుల వెంకట కోటయ్య యాదవ్, పలు సంఘాల రాష్ట్ర నాయకులు పి ఎల్ పి యాదవ్,కుర్రా శ్రీనివాస్ యాదవ్, వెంగళరావు యాదవ్, బోట్ల రామారావు యాదవ్, కొలుసు మోహన్ యాదవ్,వీరు యాదవ్, నాగార్జున యాదవ్, బంక చిరంజీవి యాదవ్, రాజా ధనవర్మ యాదవ్, సుబ్బారావు యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, మెట్ల చెంచయ్య యాదవ్, బుర్రి బుల్లెట్ శ్రీను యాదవ్, బుర్రి వెంకీ యాదవ్, బోరి గొర్ల అజయ్ యాదవ్, నరసింహ యాదవ్, మూర్తి యాదవ్ లతోపాటు పలువురు యాదవ సంఘం శ్రేయోభిలాషులు, యాదవ న్యాయవాదులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక నాయకులు, ఎంఆర్పిఎస్ ఉద్యమకారులు, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి యాదవ్ మరికొందరు మహిళలు వీరితో పాటు బాధితుల గ్రామానికి చెందినటువంటి సుమారు 300 మంది యాదవ సోదరులు గుంటూరు జిల్లా పెదనందిపాడు నియోజకవర్గం నుంచి వచ్చినటువంటి యాదవులు అనేకమంది, గొర్రెలు మేకల పెంపకం దారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందినటువంటి యాదవులు హాజరయ్యారు. సంఘాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగినటువంటి ఈ సమావేశానికి సుమారు 500 మంది యాదవు లు హాజరయ్యారు. జరిగిన దాడికి నిరసనగా ఆయా గ్రామాలను వచ్చినటువంటి గొర్రెల పెంపకం దారులు అర్ధనగ్న ప్రదర్శన చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

## కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే స్టీల్ ప్లాంట్ పురోగతికి

- 15 వేల కోట్ల కేటాయించామన్నారు.



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) మహిళల పట్ల గౌరవం లేని వ్యక్తులు రాజకీయాల్లో ఉండకూడదు అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు పాతగాజువాక టీడీపీ కార్యాలయం లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత పై మాజీ మంత్రి అనుచిత వ్యక్యలు చేయడం దారుణం అని తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యకర్త స్థాయి నుండి ఎమ్మెల్యే గా, మంత్రి గా ఒక దళిత మహిళ ఏదగడం హర్షనీయం అన్నారు. ప్రతిపక్షం అంటే ప్రజా సమస్యలపై ప్రశ్నించే విధంగా ఉండాలే తప్ప శవ రాజకీయాలు చేయకూడదు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే స్టీల్ ప్లాంట్ పురోగతికి 15 వేల కోట్ల కేటాయించామన్నారు. మొన్న జరిగిన స్టీల్ ప్లాంట్ ప్రమాదం లో తొమ్మిది మంది చనిపోతే వెంటనే కేంద్ర మంత్రులు కుమార స్వామి, రామ్మోహన్ నాయుడు,మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ లు, ఎమ్మెల్యే లు అందరూ తక్షణమే స్పందించి వారికీ భరోసా ఇస్తుంటే దాన్ని కూడా కొన్ని రాజకీయ పార్టీ ముసుగు లో ఉన్న యూనియన్ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. రిటైర్డ్ అయినా కార్మిక సంఘ నాయకులు కు స్టీల్ ప్లాంట్ తో సంబంధం ఏమిటి అన్నారు.

## ఎస్. సి. సామాజిక వర్గానికి చెందిన హోమ్ మంత్రి అనితని దూషించడం అమరనాథ్ కు తగదు

-పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు, జూన్ 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ)ఎస్సీ సామాజిక వర్గాన్ని,మహిళలను కించపరుస్తూ అన్యుత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ డిమాండ్ చేశారు.సోమవారం పెనమలూరు నియోజకవర్గం, తాడిగడప మున్సిపాలిటీ పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకుడు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఒక ఎస్సీ సామాజిక మహిళ రాష్ట్రానికి హోం మంత్రి అని చూడకుండా వ్యక్తిగతంగా దూషిస్తూ, కించపరిచే విధంగా గుడివాడ అమర్నాథ్ మాటలను ఖండిస్తూ చిత్రపటాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు, టిడిపి కార్యకర్తలు తగలబెడుతూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూరాష్ట్రంలో 2019 24 సమయంలో పరిపాలన చేసినటువంటి వైసీపీ ప్రభుత్వం వైసీపీ మంత్రులు ప్రజల పట్ల మహిళల పట్ల అనేకమైనటువంటి అక్రమాలకు తెగబడినటువంటి పరిస్థితుల్లో ప్రజల యొక్క ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం ఎస్సి సామాజిక వర్గం నుంచి ఒక మహిళ తాను చేసినటువంటి పోరాటాలకి తాను చేసినటువంటి త్యాగాలకి గుర్తింపు ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హోం మంత్రిగా వంగలపూడి అనిత కి అవకాశం ఇస్తే గడిచినటువంటి రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాంతి భద్రతను కాపాడటంలో ఒక ప్రత్యేకమైనటువంటి గుర్తింపు సాధించినటువంటి వంగలపూడి అనిత పట్ల ఆమెకు వస్తున్నటువంటి ప్రజాధరణ పట్ల ఓర్చుకోలేని వైసీపీ నాయకత్వం మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ మేకప్ మంత్రి అంటూ మహిళల యొక్క రోజువారి దినచర్యని వారి వ్యక్తిగత కార్యక్రమాల విషయంలో అనవసరమైనటువంటి రాద్ధాంతం చేస్తూ మహిళలందరినీ కించపరిచే విధంగా మేకప్ మంత్రి అంటూ ఆమె అవహేళనగా మాట్లాడటం ఎస్సీ సామాజిక వర్గానికి చెందినటువంటి సమాజాన్ని అవమానించినట్లు భావిస్తున్నామన్నారు.ఎస్సీ మహిళలు ఎస్సీ నాయకులు అందరం కూడా గుడివాడ అమర్నాథ్ యొక్క చిత్రపటాన్ని తగలబెడుతున్నాం ఇది ఒక ఆవేదన ఎస్సీ సమాజంలో ఈ యొక్క కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శాంతిభద్రత పట్ల మాకు నమ్మకం ఉంది కాబట్టి ఎటువంటి చట్ట వ్యతిరేక పనులు చేయకుండా మా ఆవేదన శాంతియుతంగా . మాజీ మంత్రి అమర్నాథ్ హోం మంత్రి అనితకి క్షమాపణ చెప్పాలి అతను చేసినటువంటి తప్పుడు అసభ్య పదజాలాన్ని వెనక్కి తీసుకోవాలి ఈరోజున కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో సమాజంలో కులమత వర్గాల భేదాలు లేకుండా నడుస్తా ఉంటే ఈ రోజున వైసీపీ కావాలని ఇటువంటి వర్గ విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందుదామని చూస్తున్నారని ఆరోపించారు. కుట్రపూరితమైనటువంటి ఆలోచనలతో ఒక ఎస్సీ మహిళ హోం మంత్రిగా ఉండటం సహించలేని వైసీపీ నాయకత్వం ఆధ్వర్యంలో గుడివాడ అమర్నాథ్ చేసినటువంటి వ్యాఖ్యలు దుర్మార్గమన్నారు. తప్పనిసరిగా ఈ రాష్ట్ర ప్రజలకి ఎస్సీ సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి,ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్, అంగిరేకుల మురళి, బొగ్గవరపు వాసు, సుంకర రమేష్ యార్లగడ్డ సుచిత్ర, మేడసాని రత్నకుమారి,గట్టు వాణి, సౌజన్య,నాగలక్ష్మి, టిడిపి నాయకులు మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి నారా లోకేష్ దంపతులకు ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం





హైదరాబాద్, నేటి శుభోదయ ::: విశిష్టమైన సోమవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు హైదరాబాద్ నివాసంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కాంక్షిస్తూ మహాశివుడికి రుద్రాభిషేకం చేశారు. రుత్వికుల వేదమంత్రాల మధ్య లోకేష్ దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

## మా ఆదివాసి కొందు విద్యార్థులు జీవితాలు నాశనం చేసిన కస్తూర్బాసో పై చర్య తీసుకోవాలని కోరుతూ

- జిల్లా కలెక్టర్ వారి చేతుల జోడించి నమస్కరిస్తూ మాకు న్యాయం చేయండి

- ఆదివాసి గిరిజన విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ లో సింగి గ్రామానికి చెందిన1.గెమ్మిల మేరీ(10) తల్లిదండ్రులు గెమ్మిల కొండ బాబు. పెదగరువు గ్రామానికి చెందిన కిలో ఝాన్సీ (10). తండ్రి కిల్లో బాబురావు. ఆదివాసి కొందు కుటుంబాలకు చెందిన కొండ శిఖర గ్రామాల్లో నుండి తన పిల్లలు చదువు కోసం రోలుగుంట గ్రామంలో కస్తూరిబాయ్ గురుకుల పాఠశాల. లలో 6 తరగతి జాయిన్ చేయడం. పదో తరగతికి వచ్చారు. సెలవులు అయిన తర్వాత కస్తూరిబాయ్ స్కూల్ నుండి మీ పిల్లలు తీసుకుని రండి అని ఫోన్ చేశాడు. లగేజ్ లు పట్టుకొని తేదీ12 స్కూల్ ఇద్దరు పిల్లలను తల్లిదండ్రులు తీసుకొని వచ్చారు. రోలుగుంట కస్తూరిబాయ్ ఎస్.ఓ వారు మీ పిల్లలకి ఆరోగ్యం బాగోలేదు. మీ పిల్లలకి ఎగ్జామ్ పెడతాము. మార్కులు ఎక్కువ వస్తే స్కూల్లో చదువుకుంటారు. లేకపోతే మీ పిల్లలు తీసి పంపిస్తా అని ముందు చెప్పారు. తర్వాత తేదీ12 తారీఖు నాడు మీ పిల్లలకి ఆరోగ్యం బాగాలేదు. టీసీలు తీసుకొని వెళ్లిపోండి అని తల్లిదండ్రులకు ఎస్.ఓ చెప్పారు. ఆరో తరగతి నుండి9 తరగతి వరకు కస్తూర్బా స్కూల్లోనే చదివారు. పది పదో తరగతి చదువు ప్రారంభంలోనే తమరు తీసి ఇచ్చి పంపిస్తామ. మా పిల్లలు ఎక్కడ జాయిన్ చేసుకోవాలి అండి మేడం వారు. అడిగాము ఏ స్కూట్లో ఏ స్కూల్లో కూడా జాయినింగ్ చేయరుమేడం వారు ఎక్కడ కూడా సీట్ ఇవ్వరు. చెప్పగా ఎస్ ఓ వారు మాత్రం మీరు. టీసీ కోసం దరఖాస్తు మీద సంతకం పెట్టండి అని చెప్పారు. ఏమి చేయాలి తెలియక. వారు రాసిన దరఖాస్తుపై సంతకం చేసి మా పిల్లలు తీసి విచ్చేశారు.చాలా అన్యాయం. కొండ శిఖర గ్రామాల్లో నివాసం ఉంటున్న మేము. మా పిల్లలు కొంత చదువులో వెనుకబాటు ఉన్న. వారిని సరిది మంచి చదువు చెప్పించవలసిన. ఎస్ ఓ గారే. మా పిల్లలకు టీ .సీ ఇవ్వడం అన్యాయం. మా పిల్లలు చదువును నాశనం చేసినటువంటి యశ్వా పై సమగ్రమైన విచారణ చేసి మాకు న్యాయం చేయాలి. కస్తూర్బా పాఠశాల ఏర్పాటు చేయడంలో. డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను. తిరిగి తీసుకొని వచ్చి కస్తూర్బా బాయిలర్ జాయిన్ చేసుకొని డ్రాప్ హౌస్ నిర్మూలన చేయడం కోసం ఏర్పాటు చేసినటువంటి పాఠశాలలో. మద్యాంతరంగా టీసీలిచ్చి పంపించడం చాలా అన్యాయం. వీటిపై జిల్లా కలెక్టర్ సమగ్రమైన విచారణ చేసి. మా పిల్లలకు భవిష్యత్తు కల్పించాలని. మేడం వారికి చేతులు జోడించి నమస్కరిస్తూ. విద్యార్థి తల్లిదండ్రు కుటుంబం వారు కలెక్టర్ వారిని వేడుకోవడం జరిగింది.విద్యార్థి తల్లిదండ్రులు కిల్లో ఈశ్వరమ్మ. కిలో బాబురావు. గెమ్మిల కొండబాబు. గెమ్మిల లక్ష్మి. గ్రామస్తులు వేడుకోవడం జరిగింది రోలుగుంట కస్తూర్బా ఎస్ఓపై. చర్య తీసుకోవాలి నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసి గిరిజనులు వెనకబాటుతనాన్ని ఆసరా చేసుకొని. అర్ధాంతరంగా చదువు మాన్పించేందుకు. స్కూల్ నుంచి తీసి ఇచ్చి పంపించిన. సో పే చర్య తీసుకోవాలి. లేకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తాం. గిరిజన సంఘం సంఘం జిల్లా అధ్యక్షుడు కే గోవిందరావు కేవీపీస్ జిల్లా కార్యదర్శి ఈ చిరంజీవి. పీటీజీ సంఘం నాయకులు గెమ్మిలి వాసు డిమాండ్ చేయడం జరిగింది

## 60 ఏళ్ల వయసులో ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు సాధించిన బొప్పన నాగమల్లేశ్వరరావు



అమరావతి, జూన్ 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) చదువుకు వయసు అడ్డుకాదని మరోసారి నిరూపిస్తూ, 60 ఏళ్ల వయసులో ఏపీ లాసెట్-2026లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి బొప్పన నాగమల్లేశ్వరరావు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దపాలపర్రు గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు ఇటీవల ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం నరసాపురంలో ఉంటున్నారు. పదవీ విరమణ అనంతరం తనకు ఉన్న న్యాయ విద్యపై ఆసక్తితో మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం కోసం ఏపీ లాసెట్ పరీక్షకు హాజరయ్యారు.ఏపీఎస్‌సీహెచ్ఈ తరఫున తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ పరీక్షలో 100 మార్కులు సాధించి రాష్ట్రంలో 9వ ర్యాంకు పొందారు. వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి సాధించిన ఈ విజయం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. నాగమల్లేశ్వరరావు విజయంపై విద్యావేత్తలు, న్యాయవాదులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేస్తున్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏ వయసులోనైనా లక్ష్యాలను సాధించవచ్చని ఆయన నిరూపించారు. తదుపరి న్యాయ విద్యను విజయవాడలోని సిద్ధార్థ లా కళాశాలలో అభ్యసించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50% రాయితీ

- తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తా- తెల్ల రేషన్ కార్డుదారులకు



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు స్కూల్స్.. కళాశాలల ఫీజులో 50% రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్.. ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్.. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ లు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ అభిసిక్త్ కిషోర్ కు వినతి పత్రం సమర్పించాయి.. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలుసుకుని జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు.. 2014 నుంచి జర్నలిస్టుల పిల్లలకు కొన్ని సందర్భాల్లో 100% మరికొన్నిసార్లు 50% స్కూల్ ఫీజు రాయితీ ఇస్తున్నట్లు కలెక్టర్ కు వివరించారు.. గత ఏడాది అప్పటి కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను పరిశీలించిన అనంతరం వెంటనే ఈ ఏడాదికి సంబంధించి కూడా అవసరమైన ప్రొసీడింగ్స్ జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అలాగే జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాలు సమస్యను కూడా వివరించగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.. ఆరోగ్య బీమాకు సంబంధించి తెల్లరేషన్ కార్డుదారులకు.. వెటరన్ జర్నలిస్టులకు సి ఎస్ ఆర్ నిధులతో ప్రీమియం చెల్లిస్తామన్నారు.. పెన్షన్ సదుపాయం... ప్రమాద బీమా పునరుద్ధరణ వంటి అంశాలను వినతి పత్రం ద్వారా కలెక్టర్ కు తెలియజేశామని గంట్ల శ్రీనుబాబు చెప్పారు.. జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజు రాయితీ ఉత్తర్వులు వెంటనే జిల్లా విద్యాశాఖ ద్వారా జారీకానున్నట్లు చెప్పారు.. ఇతర సమస్యలు పరిష్కారానికి తమ యూనియన్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు..ఈ కార్యక్రమంలోఫెడరేషన్ కార్యదర్శి జి శ్రీనివాస్ రావు ..ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రవికుమార్,ఉపాధ్యక్షులు శివప్రసాద్ నగేష్, కృష్ణమూర్తి బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, మదన్, స్మాల్ పేపర్స్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బొబ్బర్ ప్రసాద్, ఆనంద్, అరుణ్ భాస్కర్, రాజశేఖర్, చంద్రశేఖర్, సత్యనారాయణ, అప్పలనాయుడు, భాస్కర్, డిఎన్ఎస్ రెడ్డి, సతీష్, కృష్ణమూర్తి, రమేష్, గౌతమ్, వినయ్,, రమణ, సింహాద్రి,

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## ( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమానికి 155 ఫిర్యాదులు

**ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్ )కు సోమవారం 155 ఫిర్యాదులు రావడం జరిగినది**




( నేటి శుభోదయ జూన్ 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డా .శంఖబ్రత భాగ్చి, ఐ.పీ.ఎస్., వారు ప్రత్యక్షముగా నగర పోలీసు సమావేశమందిరం నందు ఉండి, నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు. జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమానికి 155 మంది ఫిర్యాదు దారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు కమిషనర్ వారికి అందజేసినారు. సిపి వారు ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇవ్వడమైనది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

## అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు

## తప్పనిసరిగా అమలు చేయాలి. లేకపోతే ట్రేడ్ లైసెన్స్ రద్దు



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆర్ యఫ్ ఓ సి. హెచ్ రత్నబాబు , సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం ఎంజీ రోడ్డులోని మినర్వా గ్రాండ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా మినర్వా గ్రాండ్‌లోని రెండు బ్లాకులను పరిశీలించగా, ఒక బ్లాక్‌లో అగ్నిమాపక భద్రతా పరికరాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. అయితే మరో బ్లాక్‌లో అవసరమైన అగ్నిమాపక పరికరాలు లేకపోవడం గమనించి, దీనిపై నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించిన అధికారులు, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.భవనంలో అగ్నిమాపక పరికరాలను తక్షణమే ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్వాహకులకు అడ్వైజరీ నోటీసు జారీ చేశారు. నిర్ణయించిన గడువులోగా ఈ లోపాలను సరిదిద్దకపోతే సంబంధిత ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసే చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖాధిపతికి సూచించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటూ, హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్ హాళ్లు, ఇతర వాణిజ్య సంస్థలు అగ్నిమాపక నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలలో డీఎఫ్ఓ మల్యాద్రి, ఎస్ఎఫ్ఓ నరేష్, ఫైర్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్)కు సహకరించాలి

**ఓటరు జాబితా సవరణ సాధారణ ప్రక్రియే**

**ఎమ్మెల్యే గద్దె, గద్దె అనురాధ**



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):-రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్క ఓటరు బాధ్యతని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనరాధ చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పూర్తిగా అధికారులకు సహకరించాలని సూచించారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె ఇంటి వద్ద స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్) కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె అనురాధ పాల్గొని ఓటరు జాబితలో తన పేరును పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. మరణించినవారు, మరో ప్రాంతానికి వెళ్ళిన వారి పేర్లు సైతం ఇప్పటికి ఓటరు జాబితాలో ఉన్నాయని, వాటిని తొలగించాలన్నారు. సరైన విధానంలో సక్రమంగా అందుబాటులో లేని వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టిందన్నారు. ఓటింగ్ శాతం 60 శాతం మాత్రమే పోల్ అవుతుందంటే అందుకు కారణం ఓటరు జాబితా సక్రమంగా లేకపోవడమే కారణమని చెప్పారు. ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేయడం ద్వారా వందకు వంద శాతం పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితాను సవరించడం అనేది సాధారణంగా జరిగే ప్రక్రియ అని చెప్పారు. ఇంటికి వచ్చే బిఎల్‌వోలకు పూర్తిగా సహకరించి, వివరాలను తెలియజేయాలని గద్దె కోరారు. గద్దె అనురాధ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దేశంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉందన్నారు. సర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఓటు హక్కు పొందడం అనేది బాధ్యతగా స్వీకరించాలన్నారు. సర్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన వారు ఓటరుగా జాయిన్ చేసుకోవడంతో పాటుగా మరణించిన వారి పేర్లు తొలగించేందుకు సమాచారం, సహకారం అందించాల్సిందిగా అనురాధ కోరారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు పవన్‌కుమార్, అబ్దుల్ కమీర్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,పార్టీ నాయకులు షేక్ అబ్దుల్ కరీమ్, ముమ్మనేని ప్రసాద్, వెనిగళ్ళ వెంకట శివప్రసాద్, మహమ్మద్ ఖాలిక్, శాయన బుజ్జి, మహమ్మద్ రిజ్వాన్, మేదరమెట్ల నారాయణ, కోడె సాంబశివరావు, బొర్రా బాలు, లియాకత్ ఆలీ, పఠాన్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# జులై14 వరకూ ఇంటింటి సర్వే ఎన్యుమరేషన్

**పత్రాలు ఇవ్వనున్న బీఎల్వోలు.**

-వివరాలు నింపి వెనక్కి ఇస్తేనే ముసాయిదా జాబితాలో పేరు.

అమరావతి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అత్యంత కీలకమైన ఇంటింటి సర్వే రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభం కానుంది. జులై 14 వరకూ నెల రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వో) ఇంటింటికీ వెళ్తారు. ప్రతి ఓటరుకూ రెండు ఎన్యుమరేషన్ ఫాంలు ఇస్తారు. వాటిలో ఓటరు పేరు, ఫొటో గుర్తింపుకార్డు నంబరు, చిరునామా వివరాలతో పాటు ఓటరు పాత ఫొటో ముద్రించి ఉంటాయి. మిగతా వివరాలను ఓటరు నింపాలి. అందుకు బీఎల్వోలు సహకరిస్తారు. పూర్తిచేసిన ఫాంలను బీఎల్వోలే వచ్చి తీసుకుంటారు.ఈ నెల రోజుల్లో ఎన్యుమరేషన్ ఫాంలు ఇవ్వడానికి, నింపినవాటిని తిరిగి తీసుకోవడానికి మూడుసార్లు బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్తారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తిచేసింది. మొత్తం 4.16 కోట్ల ఎన్యుమరేషన్ ఫాంలు ముద్రించింది. 46,397 మంది బీఎల్వోలు ఇందులో పాల్గొంటారని తెలిపారు.ఈ ప్రక్రియపై వారికి ఈసీ ఇప్పటికే శిక్షణిచ్చింది.

### ఇప్పటికే 64.6% మ్యాపింగ్ పూర్తి.

2002 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ప్రస్తుత జాబితాను పరిశీలించి మ్యాపింగ్ చేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 4,16,18,359 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,68,86,239 మందికి (64.6%) 2002లో జరిగిన సర్ ఓటర్ల జాబితాతో ఇప్పటికే మ్యాపింగ్ పూర్తిచేశారన్నారు. మరో 1,47,32,120 మంది మ్యాపింగ్ కావాల్సి ఉంది. ఓటర్ల జాబితాలో పేరున్నవారు ఎన్యుమరేషన్ ఫాంతో పాటు, 2002 నాటి జాబితాలో వారి లేదా కుటుంబీకుల వివరాలు పొందుపరిచి ఇస్తే చాలు. ఇతర పత్రాలేవీ అక్కర్లేదు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏ)




ఒక్కొక్కరు గరిష్ఠంగా 50 ధ్రువీకరించిన ఫాంలను

### బీఎల్వోలకు సమర్పించొచ్చు

2002 నాటి జాబితాలో మీ పేరుంటే ఆ వివరాలు ఎన్యుమరేషన్ ఫాంలో నింపాలి. అప్పటి జాబితాలో మీ పేరు లేకపోతే.. మీ తల్లిదండ్రులు లేదా భార్య, భర్త లేదా ఇతరత్రా కుటుంబికులు, సంబంధికుల పేర్లు ఎవరివి ఉంటే వారి వివరాలు నమోదుచేయాలి. వీటితోపాటు పుట్టిన తేదీ, ఆధార్, మొబైల్ నంబరు, తండ్రి, సంరక్షకుడి పేరు, తల్లి పేరు, భార్య లేదా భర్త పేరు, వారి ఎపిక్ నంబరు (అందుబాటులో ఉంటే) వివరాలు నింపి, కొత్త కలర్ ఫొటోలు అతికించి బీఎల్వోకివ్వాలి. రెండు ఫాంలలో ఒకదానిపై బీఎల్వో సంతకం చేసి దాన్నే రసీదుగా ఓటరుకు ఇస్తారు. దీన్ని భద్రపరుచుకోవాలన్నారు.జులై 14లోగా తిరిగివ్వాలి.పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంలను ఓటర్లు జులై 14లోగా తిరిగి బీఎల్వోలకు సమర్పించాలి. ఈ ఫాంలు వెనక్కి ఇవ్వనివారి పేర్లు జులై 21న విడుదలయ్యే ముసాయిదా జాబితాలో ఉండవని, ఎన్యుమరేషన్ ఫారాలు వెనక్కి ఇవ్వని ఓటర్లపై బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు. తెలుసుకున్న కారణాలను పోలింగ్ కేంద్రంలోని నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తారు. సరైన విచారణ చేపట్టకుండా, నోటీసు ఇచ్చి మాట్లాడే అవకాశం కల్పించకుండా జాబితా నుంచి ఎవరి ఓట్లూ తొలగించరు. ఈఆర్వో నిర్ణయంపై అభ్యంతరముంటే 15 రోజుల్లోగా జిల్లా మేజిస్ట్రేట్ 30 రోజుల్లోగా సీఈఓకు అప్పీలు చేసుకోవచ్చు.2002 నాటి, ప్రస్తుత ఓటర్ల జాబితాలు పోలింగ్ కేంద్రాల వారీగా 'సీఈవో ఆంధ్ర' వెబ్సైట్లో ఉంటాయి. బీఎల్వోల వద్ద, రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ల వద్ద లభిస్తాయి.ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటరు ఎన్యుమరేషన్ ఫాంను ఆ ఇంటిపెద్ద లేదా ఇతర కుటుంబసభ్యులకు అందజేస్తారు. వారే ఆ ఓటరు వివరాలు నింపి, వారి తరఫున సంతకం చేసి బీఎల్వోకు ఇవ్వాలి.

### సర్వే పూర్తయ్యాక..

ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి ఆగస్టు 20 వరకూ క్లెయిమ్లు, అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటరుగా చేరాలంటే ఫాం-6లో, చిరునామా మార్పునకు ఫాం-8లో, మృతులు, అనర్హుల పేర్లు తొలగింపునకు ఫాం-7లో దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబరు 18 వరకూ వాటిని పరిశీలించి, అర్హతలు ఉంటే తుది జాబితాలో పేరు చేరుస్తారు. అనర్హులుగా తేలితే తొలగిస్తారు. సెప్టెంబరు 22న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల డిమాండ్ల సాధన కోసం లేబర్ కార్యాలయం ముందు భారీ ధర్నా

**- అన్యాయమైన షరతులు తొలగించాలి --**

**పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలి --**

**ప్రమాద మరణ పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలి**



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాల అమలులో ప్రభుత్వం విధించిన అన్యాయమైన షరతులను వెంటనే రద్దు చేయాలని, 2019 నుండి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని, కార్మికులకు మెరుగైన సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా లేబర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వి కుమార్, విశాఖ జిల్లా కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి. వెంకట్రావు, అధ్యక్షురాలు పి. అనసూయ, కార్యదర్శి బి. శ్రీనివాసరావు, మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు కార్మికుల సొమ్మేనని, ఆ నిధులతో కార్మికులకు పూర్తి స్థాయి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.వారు మాట్లాడుతూ 2019 నుండి నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని




ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, 2026 మార్చి 1 నుండి కేవలం నాలుగు పథకాలను మాత్రమే అమలు చేయడం, వాటికీ అనేక ఆంక్షలు విధించడం కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు.ప్రభుత్వం సహజ మరణానికి రూ.60,000, అంత్యక్రియల ఖర్చులకు రూ.20,000, కుమార్తె వివాహానికి రూ.20,000, ప్రసూతి సహాయంగా రూ.20,000 ప్రకటించినప్పటికీ, ఇవి కార్మికుల అవసరాలకు ఏమాత్రం సరిపోవని పేర్కొన్నారు. వివాహ సహాయం, ప్రసూతి సహాయాన్ని కనీసం రూ.50,000కు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో ప్రమాద మరణానికి అందించిన [illegible] పునరుద్ధరించడంతో పాటు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రమాద మరణ పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. ప్రమాదాల్లో గాయపడిన కార్మికులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేందుకు ప్రత్యేక పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నాటికి కార్డు చెల్లుబాటులో ఉంటేనే పథకాలు వర్తిస్తాయనే నిబంధనను రద్దు చేయాలని, కార్మికుల కార్డులను ఎటువంటి షరతులు లేకుండా పునరుద్ధరించాలని కోరారు. ఇప్పటికే లేబర్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న వేలాది క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి, బకాయి మొత్తాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గతంలో మాదిరిగా లేబర్ శాఖ ద్వారానే క్లెయిమ్‌లను స్వీకరించి పరిష్కరించాలని, సచివాలయాల ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరించే విధానాన్ని రద్దు చేయాలని, సహజ మరణ క్లెయిమ్‌లకు ఎఫ్ఐఆర్ వంటి అనవసర నిబంధనలను తొలగించాలని కోరారు.60 సంవత్సరాలు నిండిన కార్మికులకు కార్డుల పునరుద్ధరణ నిలిపివేయడం అన్యాయమని పేర్కొంటూ, ప్రస్తుతం సంక్షేమ పథకాలు పొందుతున్న కార్మికులకు వయోపరిమితి ఆంక్షను తొలగించాలని, 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.5,000 వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.సంక్షేమ బోర్డు పథకాలను అర్హులైన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ఎలాంటి వివక్ష లేకుండా అందించాలని, కార్మికుల సంక్షేమానికి అవసరమైన అన్ని పథకాలను తిరిగి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా నాయకులు డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. జగన్ నాయకులు నరేంద్ర కుమార్,జె రామునాయుడు, పెంటారావు, రాజశేఖర్, ఆర్ మల్లేష్, ఎం ఈశ్వరరావు ఎ. రమణ పార్వతి డి రమణ సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నినాదాలు చేశారు.

# రైతులకు అవసరమైనంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయ్

**-కృష్ణాజిల్లా కలెక్టర్ డి. కె. బాలాజీ**

మచిలీపట్నం జూన్ 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) రైతులకు అవసరమైనంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందవద్దని, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా అందరికీ యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ తోట్లవల్లూరు మండలంలో పర్యటించి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ కొత్తగా రైతులకు ఎఫ్ ఎఫ్ ఎస్ రైతు యాప్ ద్వారా ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు సరిపడినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో కృష్ణాజిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని ఎఫ్ ఎఫ్ ఎస్ రైతు యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని సూచించిందన్నారు. ఆ సూచనల మేరకు ఏపీ ఎఫ్ ఆర్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.రైతులందరూ ఈ యాప్ కు అలవాటు పడాలని అందుకు కొంత సమయం పడుతుందని అంతవరకు రైతులందరూ కొంత ఓపిక పట్టాలని, ఎవరికి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేస్తామన్నారు. ఈ సీజన్ తో పాటు వచ్చే సీజన్ కు కూడా యూరియాను ఇప్పుడే కొనుగోలు చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. యూరియా దొరుకుతుందో లేదో అనే భయాందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. రైతు తనకు ఎన్ని సర్వే నంబర్లలో పొలం ఉంటే అన్ని సర్వే నంబర్లకు మొత్తంగా కలుపుకొని ఏపీఎఫ్ ఆర్ పోర్టల్ లో నమోదు చేయించుకోవాలన్నారు.కొంతమంది రైతులు లంక భూములు, దేవాలయ భూములు ఏళ్ల తరబడి సాగు చేస్తున్నామని వారికి సంబంధించి యజమాని ఓటిపి పంపించడానికి సమస్య ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అప్పుడు జమీందారులు రాజా గారు అధీనంలో ఉన్నందున ఆ జాబితాకు సంబంధించి వెసులుబాటు కొరకు ఢిల్లీకి వివరాలు పంపించామని అవి రాగానే అందరి సమస్య తీరుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.రైతులు యూరియా అధికంగా వాడితే భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భూసారం తగ్గితే పంటలు దెబ్బతింటాయన్నారు.రైతులందరూ యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు.ఈ సందర్భంగా




కొంతమంది రైతులు లంక భూములు, దేవాలయ భూములు ఏళ్ల తరబడి సాగు చేస్తున్నామని వారికి సంబంధించి యజమాని ఓటిపి పంపించడానికి సమస్య ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అప్పుడు జమీందారులు రాజా అధీనంలో ఉన్నందున ఆ జాబితాకు సంబంధించి వెసులుబాటు కొరకు ఢిల్లీకి వివరాలు పంపించామని అవి రాగానే అందరి సమస్య తీరుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.మరికొందరు రైతులు తాము పసుపు,కంద, చెరకు, అరటి తోటలు సాగు చేయడానికి కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం శాస్త్రవేత్తల సూచన మేరకు ఎకరాకు ఎంత మేరకు ఏ ఏ ఎరువులు ఇవ్వాలని సిఫారసు చేసిందన్నారు.ఆ ప్రకారం అర్హత మేరకు రైతులకు ఏమేమి ఎరువులు ఇవ్వాలో అవి తప్పకుండా పంపిణీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.కొందరు రైతులు నానో ఎరువులకు యూరియాకు లంకె పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ నానో ఎరువులకు, యూరియాకు ఎలాంటి సంబంధం లేదని రెండింటికి లంకె పెట్టరాదని కలెక్టర్ యూరియా కంపెనీ ప్రతినిధులకు సూచించారు.తదనంతరం జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యూరియా తదితర ఎరువుల పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జ్యోతి మణి, మార్క్ఫెడ్ డిఎం మురళీ కిషోర్, తోట్లవల్లూరు తహసిల్దారు కుసుమకుమారి, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, వివిఎ బెన్నీ ఎమన్యుల్ తదితర అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోరు ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):-రాజీవ్‌నగర్‌లోని రాజీవ్ గాంధీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల లో విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 577 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థిని +. దుర్గభవానిని ప్రత్యేకంగా అభినందించి, రూ. 5,000 నగదు బహుమతిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోరని ఈ ఫలితాలు నిరూపించాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూస్, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. విద్యా రంగ అభివృద్ధికి సుమారు రూ. 1000 కోట్ల వ్యయంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఉమా చెప్పారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం ఎంతో సంతోషకరమన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి లోకేష్ 584 మార్కులు, దుర్గభవాని 577 మార్కులు సాధించడం ప్రభుత్వ విద్యా వ్యవస్థ నాణ్యతకు నిదర్శనమని ఉమా పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు గుడ్లు, పప్పు, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'తల్లికి వందనం' వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా తల్లుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యార్థుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో విజయాలు సాధించేలా అన్ని విధాలా అండగా ఉంటుందని ఉమా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, 63వ డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, లబ్బా దుర్గా, కోలా శ్రీను, మోత్కూరి కాసిం, పైడి శ్రీను, తదితరు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా తంగిరాల ప్రభాకర్ రావు విగ్రహావిష్కరణ కార్యక్రమం



విజయవాడ, జూన్ 15 (నేటి శుభోదయ):-దివంగత ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకర్ రావు వర్ధంతి సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ శ్రీమతి తంగిరాల సౌమ్య , మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తో కలిసి కంచికచర్ల మండలం కీసర గ్రామంలో ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నందిగామ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తంగిరాల ప్రభాకర్ రావు సేవలు చిరస్మరణీయమైనవని తంగిరాల సౌమ్య, దేవినేని ఉమామహేశ్వరరావు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు సంవత్సరాలుగా న్ డీ పీ స్ కేసులో పరారీలో ఉన్న ఏ 1 గోర్లే హరి కుమార్ అరెస్టు



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) 3 సంవత్సరాల నుండి న్ డీ పీ స్ కేసులో ఏ 1 గోర్లే హరి కుమార్‌బి పరారీలో ఉన్నాడు. అనేక సార్లు బృందాలు ఏర్పాటు చేసినా స్థానాలు మారుస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. పక్కా సమాచారంతో మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్‌బి మరియు బృందం ఆంధ్ర ఒడిస్సా సరిహద్దుల్లో చాకచక్యంగా అతనిని పట్టుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.

## "సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ యేసుబాబు"



తాడేపల్లిగూడెం జూన్ 15 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్ యేసుబాబు ఈరోజు పట్టణంలోని 5, 6, 7, 9 సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి, పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. ప్రతి సిబ్బంది విధులకు సకాలంలోహాజరవుతున్నారాఫీల్డ్ విజిట్ రికార్డులు సరిగా మెయింటైన్ చేస్తున్నారా అని క్రాస్ చెక్ చేశారు. అలాగే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే రిపోర్ట్స్, ఖఖీూ డేటా ఎంట్రీ, ఫీల్డ్ వెరిఫికేషన్ పనులను కూడా చెక్ చేశారు. సర్వేలో సేకరించిన కుటుంబ వివరాలు, లబ్ధిదారుల డేటా 100% కరెక్ట్‌గా ఉండేలా చూడాలని, తప్పులు లేకుండా అప్‌డేట్ చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సేవలందించే మొదటి మెట్టు సచివాలయాలు. హాజరు, రికార్డుల నిర్వహణ, డేటా నాణ్యతలో ఎలాంటి రాజీ లేదు. ప్రజా సేవలో నిర్లక్ష్యం చేస్తే సహించనని కమిషనర్ సిబ్బందికి స్పష్టం చేశారు. సచివాలయాల్లో పారిశుధ్యం, త్రాగునీటి సౌకర్యాలు, వచ్చే ప్రజలకు కూర్చునే ఏర్పాట్లు కూడా పరిశీలించారు. ప్రజలకు మర్యాదగా, సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు, సంబంధిత వార్డ్ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు కెమికల్ ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి

- మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి

- ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్.



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పరవాడ ఫార్మసిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో సోమవారం మధ్యాహ్నం నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందడం దురదృష్టకరమని వెంటనే సమగ్ర విచారణ చేసి మృతిని కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పరిశ్రమ గేటు వద్ద మాట్లాడుతూ వలస కార్మికులకు విజయ విధమైన రక్షణ చర్యలు చేపట్టడం లేదని భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని కార్మిక కుటుంబానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ లేబర్ అధికారులు వెంటనే పరిశ్రమలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించాలని భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కార్మికుడు కుటుంబాన్ని ఆదుకోవాలని గని శెట్టి డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు గని శెట్టి తెలిపారు.

## ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి తిమింగలం..



**( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో ఓ రైతు నుండీ 20,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడ్డ డిప్యూటీ తాసిల్దార్ పృధ్వి....**

## ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్ ) లో చురుగ్గా పాల్గొన్న

- గాజువాక బాజపా శ్రేణులు



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం పెదగంట్యాడ మండలం 74వ వార్డ్ దయాళ్ నగర్ బూత్ నెంబర్ 275 లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 ఓటరు నమోదు కార్యక్రమం లో భాగంగా బి ఎల్ ఓ మౌనికను బిజేపి గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆ ప్రాంత సీనియర్ నాయకులు మండల ఇంచార్జ్ బి ఎల్ ఏ టూ పేర్ల సత్యారావుని ఆమెకు పరిచయం చేసారు. అనంతరం అందరూ కలసి ప్రజలకు ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. సర్ 2026 లో ప్రతి ఒక్కరూ తమతమ పూర్తి వివరాలు నమోదు చేయాలని కోరారు. గాజువాక నియోజకవర్గంలో ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్ తో సమన్వయం చేసుకుని అర్హులైన ప్రజలకు ఓటు నమోదు చేయాలని బాజపా బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. అదేవిధంగా చినిపోయిన వారివి, దొంగ ఓట్లను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీమతి ప్రసన్న కుమారి బీజేపీ మండల కార్యదర్శి మరియు బూత్ నెంబర్ 213 కి బి ఎల్ ఏ 2 , లాయర్ విజయ్ కృష్ణ,లోకేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఐలా చైర్మన్ గా యార్లగడ్డ గెలుపు పై తెలుగు శక్తి హర్షం

- తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్




( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక: నువ్వా నేనా అంటూ ఉత్కంఠ భరితంగా సాగిన ఐలా ఎన్నికల్లో ఐలా చైర్మన్ గా యార్లగడ్డ సాంబశివరావు గెలుపుపై తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆటోనగర్, గాజువాక లో యార్లగడ్డ సాంబశివరావు ను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ అందర్నీ కలుపుకొని ఐలా ను అభివృద్ధి వైపు నడిపించాలని అలాగే ఇక్కడ పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా మీ ద్వారా పరిష్కారం జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని అన్నారు. యార్లగడ్డ ను కలిసిన వారిలో వై.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్.పాండురంగ ప్రసాద్, డి.వి.ఎస్.రాంబద్ర రాజు, పి.ప్రభాకర్, ఎస్.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, బొల్లినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలను వదులుకుందాం- జీవితాన్ని ప్రేమిద్దాం

- సే నో టూ డ్రగ్స్ -- సే యస్ టూ లైఫ్



( నేటి శుభోదయ జూన్ : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలన మరియు యువతలో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా, పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పద్మనాభ నగర్ జడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించబడింది. పెందుర్తి పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ వారి సూచనల మేరకు, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ షేక్ జిలాని వారు విద్యార్థులతో సమావేశమై మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని, వాటికి దూరంగా ఉండటం ప్రతి విద్యార్థి బాధ్యత అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాల బారిన పడితే విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం మరియు సమాజంలో గౌరవం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే, "మంచి స్నేహితులను ఎంచుకోండి -- చెడు అలవాట్లకు దూరంగా ఉండండి", "మీ కలలను ప్రేమించండి -- మాదకద్రవ్యాలను కాదు", "నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులు" అనే సందేశాలతో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టి, క్రమశిక్షణతో చదువుకుంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.




## డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం




పాలసముద్రం, : మాదక ద్రవ్యాల దుర్వినియోగ నివారణ, మానసిక ఆరోగ్య పరిరక్షణ, సంస్థాగత సమన్వయంపై శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతలో మానసిక ఆరోగ్య ప్రాధాన్యత, కుటుంబాలు, విద్యాసంస్థల పాత్రపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్, ఐఆర్ఎస్ అధికారి గణేష్ దత్ లోహాని మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలతో పాటు సమాజానికీ తీవ్రమైన ముప్పుగా మారుతోందన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాసిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం. సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంతో నాసిన్ అకాడమీలో సమర్థులైన ఐఆర్ఎస్ అధికారులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన డ్రగ్స్ నిర్మూలన పిలుపు దిశగా అకాడమీ పనిచేస్తోందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పనిచేస్తేనే మాదక ద్రవ్యాల రహిత భవిష్యత్తు సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. "బలమైన సమాజం కోసం అవగాహన, సహకారం, సమిష్టి బాధ్యత అవసరం" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన 150 మంది ఐఆర్ఎస్, నార్కోటిక్ అధికారులు, రెండు తెలుగు రాష్ట్రాల ఈగల్ టీమ్ సభ్యులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కేంద్రీయ విద్యాలయాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వృద్ధులకు కనీసవసరాలు కల్పించాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో ఆర్ టిసి డిపో మేనేజర్.




హిందూపురం : - హిందూపురం అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర రావు ఆదేశాల మేరకు స్థానిక ఆర్ టి సి బస్టాండ్ డిపో మేనేజర్ మునిరామయ్య ఆధ్వర్యంలో బస్టాండు ప్రాంగణంలో సోమవారం న్యాయ సేవ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మునిరామయ్య వృద్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్ టి సి బస్సుల్లో 25 శాతం ప్రభుత్వం రాయితీ కల్పించిందన్నారు. న్యాయ సేవలు ప్రత్యేక హక్కులు గురించి ప్రసంగించారు. పిఎల్ వీలు మాట్లాడుతూ భారతదేశంలో 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ సీనియర్ సిటిజన్ (వృద్ధులు) అంటారు. వీరు కుటుంబానికి, సమాజానికి అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు, పథకాలను కల్పిస్తుంది. సీనియర్ సిటిజన్లకు సంబంధించిన ప్రత్యేక హక్కులు మరియు రక్షణ చట్టపరమైన రక్షణలు ఉండాలని కోరారు. తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం-2007 ప్రకారం పిల్లలు లేదా బంధువులు వృద్ధులకు ఆహారం, వసతి, వైద్యం కల్పించాలి. అలా చేయకపోతే శిక్షార్హులు. సీనియర్ సిటిజన్లకు సంబంధించిన కోర్టు కేసులను త్వరితగతిన (90 రోజుల్లోగా) పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ టి సి అసిస్టెంట్ మేనేజర్ తిరుమలేష్, డిపో క్లర్క్ ముస్తఫా, కంట్రోలర్ ఏ.వి వి ప్రసాద్ , బి ఎన్ చంద్రుడు మరియు లోకేఅదాలత్ సిబ్బంది రాజా, పిఎల్ వీలు మార్గదర్శి మాళప్ప, గోపాలకృష్ణ ,చంద్రకాంత్ ,గణేష్ శశికుమార్ , ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ



పరిగి :- పరిగి పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ నరసింగప్ప సోమవారం ఆకస్మికంగా సందర్శించి పోలీస్ స్టేషన్ నిర్వహణ రికార్డులు పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రిజిస్టర్లు కేసు ఫైళ్లు దర్యాప్తు పురోగతిని తనిఖీ చేశారు. ముఖ్యంగా పోక్సో కేసులు దొంగతనాల కేసులు అక్రమ ఇసుక రవాణా జూదం (గ్యాంబ్లింగ్) సంబంధిత వ్యవహారాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని మహిళలు చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ ఆదేశించారు. స్టేషన్ పరిధిలో అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాగి పంట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు



హిందూపురం :- హిందూపురం రూరల్ మండల పరిధిలో మలుగూరు గ్రామం నందు రాగి పంట కొనుగోలు కార్యక్రమాన్ని జిల్లా మేనేజర్ సివిల్ సప్లై అధికారి రాజు నాయక్ , జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ క్రిష్ణ నాయక్ మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు హిందూపురం కృష్ణయ్య పరిశీలించారు . మండల వ్యాప్తంగా 970 ఎకరాలలో రాగి పంటని గత రబీ సీజన్లో సాగు చేయడం జరిగింది. ఇప్పటివరకు దాదాపు 1500 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగింది. మిగిలిన పంటను త్వరితగతిన కొనుగోలు చేయాలని మండల కో-ఆపరేటివ్ అధికారులకు తెలియజేశారు. గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు పంట నమోదు తనిఖీ చేసుకొని షెడ్యూల్ ప్రకారంగా రైతులకి ముందస్తుగా ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ ,మండల కో-ఆపరేటివ్ చైర్మన్ శంకరప్ప , సీఈఓ రామకృష్ణారెడ్డి, నవీన్, సుబ్బన్న, దీపారాణి , రైతు సోదరులు పాల్గొన్నారు .

## ఎపిలో పిడుగులతో కూడిన వర్షాలు




విజయవాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా ఎపి లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కూడా వాతావరణం మారే సూచనలు కనిపిస్తున్నాయి. అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాల్లో ఉండటం మంచిది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కీలక సూచనలు చేశారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉరుములతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద నిలబడటం ప్రమాదకరం అని అన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, బయట తిరిగే వారు తక్షణమే సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని కోరారు. అనవసరమైన పనుల కోసం బయటకు వెళ్లడం తగ్గించుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునన్నారు. ఎపి లోని కీలక జిల్లాలపై ఈ వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా ఉంటుందని తెలియజేశారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, గోదావరి జిల్లాల ప్రజలు వాతావరణ పరిస్థితులపై దృష్టి పెట్టాలి. ఎన్టీఆర్, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్న వారు కూడా వాతావరణ హెచ్చరికలను గమనించాలి. వాతావరణ శాఖ ఇచ్చే తాజా సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. వర్షాల సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండటం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు.

## నెతన్యాహు చాలా కఠినమైన వ్యక్తి : ట్రంప్



వాషింగ్టన్ : పశ్చిమాసియాలో దాదాపు మూడు నెలలుగా ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణలకు ముగింపు పలకడానికి ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. అయితే ఈ ఒప్పందానికి అత్యంత సన్నిహితుడైన ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అభ్యంతరం తెలిపారన్నారు. ఈ సందర్భంగా అతన్ని(నెతన్యాహు) చాలా కఠినమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. కాగా, ట్రంప్ న్యూయార్క్ టైమ్స్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఎట్టకేలకు ఇరాన్‌తో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కుదర్చుకోవడానికి అమెరికా చేసిన ప్రయత్నానికి, మిత్ర దేశం ఇజ్రాయిల్ తన మద్దతు ప్రకటించాలి. కృతజ్ఞతలు తెలపాలి' అని ఆయన అన్నారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరిందని ప్రకటించే ముందు తాను ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాతో 28 నిమిషాలపాటు ఫోన్‌లో సంభాషించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. తాను నెతనాహ్యుతో జరిపిన సంభాషణలో లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్ని గురించి ప్రస్తావించినట్లు ట్రంప్ చెప్పారు. 'ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదర్చినందుకు నెతన్యాహు మాకు చాలా కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే ఒకవేళ ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండి ఉంటే, ఇజ్రాయెల్ రెండు గంటల పాటు కూడా మనుగడలో ఉండేది కాదు' అని ట్రంప్ న్యూయార్క్ టైమ్స్‌తో అన్నారు. ఆదివారం నాడు ఇరాన్‌తో ఒప్పందాన్ని అమెరికా ప్రకటించడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయిల్ బీరూట్‌పై దాడి చేసింది. దీనిపై ట్రంప్ స్పందించారు. నెతన్యాహుకు అసలు విచక్షణే లేదని ట్రంప్ విమర్శించారు. "బిబి ఆ దారుణమైన దాడి ఎందుకు చేయాల్సి వచ్చింది? నాకు చాలా కోపం వచ్చింది. ఆ విషయాన్ని నేను అతని (నెతన్యాహు)కి చెప్పాను. అతనికి ఏమాత్రం విచక్షణ లేదు. దీనివల్ల పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఒప్పందంపై సంతకం చేయడం కొన్ని గంటల పాటు వాయిదా పడింది అని ట్రంప్ 'ఆక్సియోస్' మీడియాతో అన్నారు. ఆ తర్వాత మళ్లీ సవరించుకుని.. నెతన్యాహుపై నేను చూపింది కోపం అని చెప్పను. కానీ అతను నిరంతరం లెబనాన్‌తో గొడవ పడడం నన్ను కొంచెం కలవరపెట్టింది అని న్యూయార్క్ పోస్ట్ పాడ్ ఫోర్స్ వన్‌తో ట్రంప్ అన్నారు.

## 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం : బ్రిటన్ ప్రధాని



లండన్ : పదహారేళ్ల లోపు చిన్నారులకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం వెల్లడించారు. సోషల్ మీడియా వ్యసనం వల్ల చిన్నారుల జీవితాల్లో చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా వారి మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందో గమనించిన తర్వాత వేలాది మంది తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. కాగా 'ఈ రోజుల్లో, సాంకేతికత తమ జీవితంలోని ప్రతి రంగంలోనూ చొరబడుతున్న, అత్యంత వేగంగా మారుతున్న ప్రపంచంలో పిల్లలు తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకోవాల్సి ఉంది. అది వారికి హాని చేస్తుందని మాకు తెలుసు. సంప్రదింపుల ప్రక్రియలో తల్లిదండ్రుల నుంచి వచ్చిన స్పందన అత్యంత స్పష్టంగా ఉంది. వేలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలు సోషల్ మీడియాకు బానిసలయ్యారని చెబుతున్నారు. సోషల్ మీడియా చిన్నారుల నిద్రకు, ఆటలకు, ఆఖరికి కుటుంబంతో గడిపే సమయాన్ని కూడా దూరం చేస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యంపై హానికరమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులకు మన మద్దతు అవసరం. అందుకే, 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించాలని ప్రభుత్వం నేడు నిర్ణయించింది అని కీర్ స్టార్మర్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన కొన్ని కంపెనీలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. కానీ మేము వాటిని ఎదుర్కొంటాం. ఎందుకంటే ఈ నిర్ణయం తీసుకోవాల్సిన అత్యంత అవసరంగా మా ముందుకొచ్చింది. మన పిల్లలకు సంతోషం లేకుండా.. భద్రత లేకుండా సోషల్ మీడియా చేస్తోంది. మన పిల్లలు మరింత పటిష్టమైన, న్యాయమైన బ్రిటన్‌లో వారు సంతోషకరమైన, సురక్షితమైన బాల్యాన్ని పొందడానికి అర్హులు అని వీడియో సందేశంలో కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. బ్రిటన్ సోషల్‌మీడియాను నిషేధం విధించిన దేశాల జాబితాలో చేరింది. జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాలు సోషల్ మీడియాపై నిషేధం విధించింది. ఇక స్పెయిన్, డెన్మార్క్‌లు ఈ నిర్ణయంపై ఆలోచిస్తున్నాయి.

## పెన్నులు కొనుగోలు చేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!




లక్నో: వేసవి సెలవులు ముగిశాయి. స్కూళ్లు, కాలేజీలు తెరుచుకున్నాయి. కావాల్సిన బ్యాగ్స్,బుక్స్, పెన్నులు కొనుగోలు చేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్టేషనరీ షాపులకు క్యూకట్టారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ పోలీస్‌శాఖ రాష్ట్ర ప్రజల్ని అప్రమత్తం చేసింది. స్టేషనరీ షాపుల్లో కొనుగోలు చేసే పెన్నుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. పెన్నుల్లా కనిపించేవన్నీ పెన్నులు కాదని.. సంఘ విద్రోహ శక్తులు పెన్నులకు బదులు..వాటి ఆకారంలో ఉండే బాంబుల్ని తయారు చేశారని తెలిపింది. అందుకు సంబంధించిన ఫొటోల్ని విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లో పెన్ ఆకారంలో ఉన్న అనుమానాస్పద వస్తువులపై ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. బులంద్‌షహర్ జిల్లా పోలీసులు (ఖుర్జా పోలీస్ స్టేషన్ పరిధి) ఈ అడ్వైజరీని విడుదల చేశారు. పెన్‌లా కనిపించే అనుమానాస్పద వస్తువులను తాకరాదని ప్రత్యేక సూచనలు చేశారు. ఇవి విస్ఫోటక పరికరాలుగా మార్పిడి చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు రోడ్లపై, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో లేదా ఎడారిలాంటి ప్రాంతాల్లో కనిపించే వస్తువులను తాకకుండా 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారం అత్యంత కీలకమని, శిక్షణ పొందిన భద్రతా సిబ్బందే ఇలాంటి వస్తువులను పరిశీలించాలని తెలిపారు. ప్రజలు సూచనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.

# ఏమున్నది గర్వకారణం?



ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టి పన్నెండేళ్లు పూర్తయ్యాయి. వరుసగా మూడోసారి అధికారంలో కొనసాగుతున్న ఆయన, స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా పనిచేసిన నాయకునిగా చరిత్ర సృష్టించినట్లు చెప్తున్నారు. 1952 నుంచి జవహర్‌లాల్ నెహ్రూ పాలనను సాంకేతికంగా లెక్కించి ఆ రికార్డును బుధవారం నాడు మోడీ అధిగమించినట్లు ప్రచారం చేస్తున్నారు. 1947 నుంచి ఐదేళ్ల పాటు సాగిన నెహ్రూ పాలనను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. ఈ చర్యతో మోడీని తిరుగులేని నాయకునిగా చిత్రీకరించడానికి సంఘ్‌పరివార్, బిజెపి, వాటి అనుబంధ సంస్థలు, గోడీ మీడియా ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, ఈ ప్రచార హోరును పక్కనబెట్టి ఈ పన్నెండేళ్ల పాలన దేశ ప్రజల జీవితాలపై ఎలాంటి ముద్ర వేసిందన్నది పరిశీలిస్తే ఏమున్నది గర్వకారణమన్న మహాకవి మాటలే గుర్తుకువస్తాయి. మోడీ పాలన అనగానే 2016 నవంబరు 8న ప్రకటించిన నోట్ల రద్దు నిర్ణయం తొలుత గుర్తుకొస్తుంది. ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా కుదిపేసింది. అసంఘటిత రంగం, చిన్న పరిశ్రమలు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు కోలుకోలేని దెబ్బతిన్నారు. బ్యాంకుల ముందు క్యూలలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు దేశ ప్రజలకు ఎప్పటికీ పీడకలే! అకస్మాత్తుగా ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ లక్షలాది వలస కార్మికులను రోడ్డున పడేసింది. వందల కిలోమీటర్లు కాలినడకన స్వగ్రామాలకు వెళ్లిన వారి దృశ్యాలు మనదేశ సామాజిక వాస్తవికతను ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టాయి. రెండో దశ కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత, పడకల లభ్యత లేకపోవడం, ఔషధాల కొరత కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గంగానదిలో తేలిన మృతదేహాలు, శ్మశానాల్లో కనిపించిన భయానక దృశ్యాలు ప్రభుత్వ వైఫల్యాలకు ప్రతీకలుగా మిగిలిపోయాయి. ఆర్థిక రంగంలోనూ మోడీ పాలన సాధించిన ఘన విజయాలు దాదాపు శూన్యం! రోజురోజుకి కృంగి కృశించి పోతున్న రూపాయి విలువే దీనికి నిదర్శనం. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పెరిగిన ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను ఘోరంగా దెబ్బతీశాయి. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల నిజ ఆదాయాలు అందుకు అనుగుణంగా పెరగడంలేదు. కార్పొరేట్ సంస్థలకు భారీ పన్ను రాయితీలు, రుణాల మాఫీలు ప్రకటిస్తూనే, సామాన్యులపై పరోక్ష పన్నుల భారం మోపిన ఘనత నరేంద్రమోడీ ప్రభుత్వానిది. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల లాభాలే లక్ష్యంగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రైతులపై రుద్దడానికి చేసిన ప్రయత్నం దేశ చరిత్రలోనే అతి పెద్ద రైతాంగ ఉద్యమానికి దారితీసింది. విదేశాంగ విధానంలోనూ 'విశ్వగురు'వంటి ప్రచార యావ తప్ప, జాతీయోద్యమ వారసత్వంగా నెలకొల్పిన విలువలను మంట గలిపిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కింది. ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు క్షీణించాయి. అన్ని రంగాల్లోనూ అమెరికా అడుగులకు మడుగులొత్తడమే లక్ష్యంగా మారింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న దాడులపట్ల మన దేశ వైఖరే దీనికి నిదర్శనం. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపర్చడం, ప్రజాసామ్య విలువలను తుంగలో తొక్కడంలో గత ప్రభుత్వాలతో పోలిస్తే మోడీ సర్కారుదే పై చేయి! పార్లమెంటు చర్చల సంప్రదాయం క్షీణించింది. దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రత్యర్థులను, మేధావులను, లౌకిక వాదులను, అభ్యుదయ శక్తులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఎన్నికల కమిషన్‌తో పాటు న్యాయవ్యవస్థ స్వతంత్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో సమాఖ్య స్ఫూర్తిని ఘోరంగా దెబ్బతీశారు. హిందూ మతోన్మాదం, మైనారిటీలపై విద్వేష ప్రచారం, గోగూండాల దాడులు, విద్వేష ప్రసంగాలు దేశ స్వాతంత్ర్య పోరాటం నిర్మించిన లౌకిక, బహుళత్వ విలువలకు సవాల్‌గా మారాయి. ఈ వాస్తవ పరిస్థితిని మోడీ ప్రచార యంత్రాంగం మసిపూసి మారేడు కాయ చేస్తోంది. అయితే, ఈ పరిస్థితి ఎల్ల కాలం సాగదు. నాయకుల్ని వారి వాగాడంబరంతో కాకుండా, వారు సాధించిన ఫలితాలతోనే చరిత్ర అంచనా వేస్తుంది. నిరుద్యోగంతో నిస్సహాయులైన యువతరం, లేబర్ కోడ్‌లతో భద్రత కోల్పోయిన కార్మికులు-ఉద్యోగులు, భవిష్యత్తుపై బెంగలో చిక్కుకున్న రైతాంగం, మనువాద శక్తుల విజృంభణతో నిస్సహాయులుగా మారుతున్న మహిళలు, దళితులు, మైనార్టీలు...ఇవి చాలవా... పన్నెండేళ్ల కార్పొరేట్-మతతత్వ కూటమి పాలన ఘనతను అర్థం చేసుకోవడానికి!

# ప్రజా పాత్రికేయ విజయం




ప్రజా పాత్రికేయుడు, న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థపై పెట్టిన కేసులను రద్దు చేస్తూ, ఈనెల పదో తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం. ఈ కేసుల బనాయింపు, కొనసాగింపూ "చట్ట ప్రక్రియ దుర్వినియోగం"గా మారిందని కోర్టు వ్యాఖ్యానించటం మోడీ ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ. మూడు సంవత్సరాలకు పైగా సాగిన దర్యాప్తులు, దాడులు, అరెస్టులు, కోర్టు విచారణల అనంతరం వచ్చిన ఈ తీర్పు ఒక వ్యక్తి విముక్తి మాత్రమే కాదు. మోడీ-అమిత్ షా ప్రభుత్వపు అణచివేతపై ప్రజాస్వామ్య విలువలు సాధించిన విజయం. ప్రజా పాత్రికేయం ఎగురవేసిన గెలుపు పతాకం! ప్రబీర్ పుర్కాయస్థకు ఈ నిర్బంధమూ, అధికార దురహంకారం చేసే దాడీ కొత్త కాదు. 1975 ఎమర్జెన్సీ కాలంలో జెఎన్‌యు విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు ఆయన్ని దురుద్దేశపూర్వకంగా అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం మీసా చట్టం కింద అరెస్టు చేసింది. వేరొక విద్యార్థి నాయకుడిని వెతుక్కుంటూ వచ్చిన ఢిల్లీ పోలీసులు తోటి విద్యార్థులతో ఉన్న ప్రబీర్‌ను బలవంతంగా ఎత్తుకుపోయారు. అప్పటికప్పుడు తప్పుడు కేసులు బనాయించి జైలులో నిర్బంధించారు. తరువాత జనతా ప్రభుత్వం నియమించిన జస్టిస్ షా కమిషన్ ఈ ఉదంతంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "అపరిమితమైన అధికార దురహంకారం, అధికారుల వెన్నెముకలేనితనం కలిస్తే ఏమి జరుగుతుందో ఈ ఘటన తెలియజేస్తుంది" అని చీవాట్లు పెట్టింది. "ప్రధాని నివాసంలో ఎవరినో సంతృప్తిపరచడానికే ఈ అరెస్టు జరిగింది" అని కూడా పేర్కొంది. అధికార దుర్వినియోగం, అధికారుల లొంగుబాటు కలిసి ప్రజాస్వామ్య వ్యవస్థపై శాశ్వత మచ్చ వేస్తాయని హెచ్చరించింది. దాదాపు 48 ఏళ్ల తరువాత 2023లో మళ్లీ అదే జరిగింది. ఏ ఆధారాలు లేకుండానే ఆరోపణలు గుప్పించి ప్రబీర్‌ను 220 రోజులకు పైగా జైల్లో ఉంచింది మోడీ-షా ప్రభుత్వం. పాలకుల కనుసన్నల్లో దర్యాప్తు సంస్థలు ప్రబీర్ మీద చేసిన కేసుల బనాయింపులు, ఆరోపణలు చాలా దారుణం. ఆయన విదేశీ నిధులు పొంది జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే చర్యలు చేపట్టారని దుర్మార్గమైన కేసులు పెట్టారు. ప్రబీర్ ప్రజాపక్షాన తన జీవితాన్ని అంకితం చేసుకున్న గొప్ప మేధావి, ఇంజనీరు. ఉద్యోగాన్ని వదులుకొని న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్ ద్వారా ప్రజా జర్నలిజం వైపు నిలిచారు. ప్రధాన స్రవంతి మీడియా విస్మరించిన అనేక ప్రజా సమస్యలను, ఉద్యమాలను వెలుగులోకి తీసుకొచ్చారు. 2020-21లో నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన మహోద్యమాన్ని అనేక క్షేత్రస్థాయి కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగం, ప్రజారోగ్యం, విద్య, ఆర్థిక అసమానతల వంటి అంశాలపై కథనాలు ప్రచురించారు. ప్రధాన మీడియాలో అత్యధిక భాగం తమ కాళ్ల ముందు సాగిలపడుతున్న దశలో, ప్రబీర్ పోర్టల్ ద్వారా ఎదురు నిలవడం మోడీ ప్రభుత్వానికి కంటగింపుగా తయారైంది. ఎలాగైనా అణచివేయాలని 2021 నుంచే వివిధ రూపాల్లో ప్రయత్నించి, విఫలమైంది. 2023లో ఓ అమెరికా పత్రిక ప్రచురించిన తాడూ బొంగరం లేని ఒక కథనాన్ని నెపంగా తీసుకొని, న్యూస్‌క్లిక్ కార్యాలయంపైనా, అందులో పనిచేసే జర్నలిస్టులు, రచయితలు, పరిశోధకులు, కార్యకర్తల ఇళ్లపైనా దాడులకు తెగబడింది. ప్రబీర్ పుర్కాయస్థ, సంస్థ హెచ్ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిపై ఉపా చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేసింది. 2024 మే 15న సుప్రీంకోర్టు ఆయన అరెస్టు చట్టవిరుద్ధమని ప్రకటించింది. ఇది కేసుకు మొదటి పెద్ద ఎదురుదెబ్బ. ఢిల్లీ హైకోర్టు ఇప్పుడు ఆ కేసునే కొట్టిపారేసింది. భారతదేశంలో దిగజారిన పత్రికా స్వేచ్ఛకు న్యూస్‌క్లిక్‌పై దాడి ఒక ఉదాహరణ. సిద్ధిక్ కప్పన్, మహ్మద్ జుబైర్ వంటి జర్నలిస్టులపైనా కేసులు బనాయించి జైల్లో బంధించటం, ప్రజాపక్షాన నిలిచే మీడియా సంస్థలపై దాడులు జరపటం వంటి పాలకుల కక్షపూరిత చర్యలు ఇంకెన్నో ఉన్నాయి. 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో 180 దేశాల మధ్య భారత్ స్థానం 157లో ఉండడం సిగ్గుచేటు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను హామీ ఇస్తోంది. భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం, ప్రభుత్వాన్ని విమర్శించడం, ప్రజా ఉద్యమాల వార్తలను ప్రజలకు చేరవేయడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ. జాతీయ భద్రత పేరుతో ఆ హక్కులను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తాజా తీర్పు చట్టాన్ని రాజకీయ ఆయుధంగా ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా తన కక్షపూరిత వైఖరిని, నిరంకుశ ధోరణులను విడనాడాలి. లేకుంటే ఇలాగే పరాభవాలు ఎదురవుతాయి.

# ఎంత దారుణం..!



ఒమన్ తీరం లోని చమురు నౌక పై క్షిపణి దాడి చేసి ముగ్గురు భారత నావికుల్ని పొట్టనబెట్టుకున్న అమెరికా దుశ్చర్య గర్హనీయం. ప్రాణాలు కోల్పోయిన ముగ్గురిలో ఒకరైన పట్నాల సురేష్ విశాఖ వాసి కావడం మరింత బాధాకరం. వీరు పౌర నావికులే తప్ప సైనికులు కారు. ఈ ఘటన పౌర నౌకాయానానికి పెరుగుతున్న ప్రమాదానికి హెచ్చరిక. ఆ నౌకలో ఇరాన్ చమురు రవాణా చేయడంలేదని దాని యజమానులు స్పష్టం చేసినా ఇరాన్ నుండి చమురు కొన్నారన్న నెపం మోపి అమెరికా దాడికి పాల్పడడం దురహంకారానికి నిదర్శనం. భారత వాణిజ్య నౌకలపై అమెరికా నావికాదళం ఈ వారం రోజుల్లోనే మూడుసార్లు దాడి చేసింది. ఘనత వహించిన నరేంద్ర మోడీ సర్కారు అమెరికా ఆంక్షలకు లోబడి ఉన్నప్పటికీ భారత నౌకలపై దాడి చేయడం భారత్ పట్ల ట్రంప్ సర్కారుకు ఎంత చిన్నచూపో విదితమవుతోంది. మన సార్వభౌమాధికారాన్ని సవాలు చేసేలా ముగ్గురు నావికుల్ని బలి తీసుకున్న అమెరికా ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వం లొంగుబాటు వైఖరి ప్రదర్శించడం అవమానకరం. పశ్చిమాసియాలో అమెరికా దాడులను భారత ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించాలి. ఈ దాడికి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా భారత ప్రభుత్వం వ్యవహరించాలి. అమెరికా ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గాలను శాంతికాముకులు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలనే ప్రతి ఒక్కరూ ఖండించాలి. భారత నావికులున్న నౌకపై అమెరికా దళాలు చేసిన దాడి పై స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరపాలి. సంఘర్షణ ప్రాంతాల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతను నిర్ధారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, వాణిజ్య నౌకలకు పటిష్టమైన నావికాదళ రక్షణ, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సి ఐ టి యు సహా వివిధ సంస్థలు చేస్తున్న డిమాండ్ సబబైనది. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, నౌకా యజమానులు, అలాగే నావికుల సంఘాలతో శాశ్వత సంక్షోభ నిర్వహణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ దాడిలో చనిపోయిన నావికా సిబ్బంది కుటుంబాలకు పరిహారం, బీమా మొత్తాన్ని సకాలంలో అందించి, వారిపై ఆధారపడిన వారికి శాశ్వత ఉపాధి కల్పించాలి. అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో పనిచేస్తున్న నావికులకు తప్పనిసరి యుద్ధ-ప్రమాద భత్యం, మెరుగైన బీమా కవరేజీని అందించాలి. సురక్షిత సముద్ర మార్గాలను ఏర్పాటు చేయడం, సంఘర్షణ ప్రభావిత జలాల్లో ప్రయాణాలను సమీక్షించడం, వాణిజ్య నౌకాయానం, పౌర నావికులను రక్షించడానికి అంతర్జాతీయ వేదికలపై బలమైన దౌత్యపరమైన చర్యలు చేపట్టడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. లేకపోతె మన నావికులకు భద్రత ఉండదు. పశ్చిమాసియా లో అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం మూలంగా భారత్ తో సహా ప్రపంచ దేశాలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇంధన సంక్షోభం పర్యవసానంగా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. కాబట్టి ఈ యుద్ధాన్ని, అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షను యావత్ ప్రపంచం వ్యతిరేకించాలి. కానీ మన కేంద్ర ప్రభుత్వం మాత్రం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా వ్యవహరిస్తూ దాని దురాగతాల్ని వివిధ సందర్భాల్లో వెనకేసుకు రావడం దారుణం. మనకు చౌకగా చమురు గ్యాస్ సరఫరా చేసిన దీర్ఘ కాల మిత్ర దేశం ఇరాన్ తో సంబంధాలు చెడగొట్టుకోవడంతో సహా పలు దౌత్య వైఫల్యాలకు పాల్పడింది. అయినా తాజాగా అమెరికా మన నావికులపై చేసిన దాడిని ఇరాన్ ఖండించి మిత్రత్వాన్ని చాటుకుంది. దేశం ఇంధన సంక్షోభంలో చిక్కుకోవడం మోడీ ప్రభుత్వ స్వయంకృతాపరాధమేనన్న ఆర్థిక నిపుణుల మాట ప్రత్యక్షర సత్యం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ విధానాన్ని మార్చుకొని భారత సార్వభౌమత్వాన్ని సమున్నతంగా నిలపాలి. అందుకోసం ప్రజల నుండి ఒత్తిడి పెరగాలి. ఆ దిశగా ప్రగతికాముక శక్తులు కృషి చేయాలి. అమెరికా, ఇజ్రాయిల్ తో సహా వివిధ దేశాల్లో సాగుతున్న యుద్ధ వ్యతిరేక వాతావరణం భారత్ లో అభివృద్ధి కావాలి.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .